


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 22, పేజీలు - 08

శనివారం, మే 18, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam, Tirupati

## నా కొడుకును మీకు అప్పగిస్తున్నాను

**- రాయ్‌బరేలీలో సోనియా గాంధీ**




రాయ్‌బరేలీ (ప్రశ్న న్యూస్) లోక్ సభ ఎన్నికలు ఐదో దశకు చేరుకున్నాయి. ఈ నెల 20న పలు రాష్ట్రాల్లో ఐదో దశ పోలింగ్ జరగబోతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటేయాలని ప్రచారం చేస్తున్న రాహుల్ గాంధీని ఆయన తల్లి సోనియా గాంధీ రాయ్ బరేలీ ఓటర్లకు పరిచయం చేశారు. గతంలో తనను పలుమార్లు గెలిపించిన రాయ్ బరేలీ ఓటర్లకు ఈ మేరకు విజ్ఞప్తి చేసేందుకు

6లో ▶

## టీపీసీసీ చీఫ్ పదవి ఎవరికి దక్కేనో.?

**- ఎవరి ప్రయత్నాల్లో వారు, రేవంత్ రెడ్డి ఓటు ఎవరికి.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల సంగ్రామం ముగిసింది. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తరువాత తెలంగాణ పీసీసీ చీఫ్ మార్పు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రంలో అధికార పీఠం ఎవరికి దక్కనుందో జూన్ 4న తేలనుంది. ఆ తర్వాత కాంగ్రెస్ హై కమాండ్ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే విషయంలో దృష్టి సారిస్తుందని నేతలు చెబుతున్నారు. పీసీసీ చీఫ్ గా జూన్ 26, 2021 లో రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. అప్పటి నుండి రేవంత్ రెడ్డి సారధ్యంలో శాసన సభ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంది.

### అధికారంలోకి తేవడంలో రేవంత్ సక్సెస్

జీరోగా ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీనీ అధికారంలోకి తేవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతమయ్యారు. వెంటనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో రేవంత్ సారధ్యంలోనే మళ్లీ సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగింది. ఆయా సర్వేలు చెప్పినట్లు రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకుంటుందన్న నమ్మకంలో హస్తం నేతలు ఉన్నారు. సారధ్య బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి తనదైన దూకుడుతో రేవంత్ రాజకీయాలు సాగించారు. వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ పార్టీని గద్దె దింపే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లోను మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని కాంగ్రెస్ అగ్రనాయకత్వం నమ్మకంతో ఉంది. ఇక రాష్ట్ర పాలనా వ్యవహారాలపై రేవంత్ పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించేలా, వెసులుబాటు కల్పించేందుకు గాను టీపీసీసీ బాధ్యతలను వేరొకరికి అప్పగిస్తారని ప్రచారం సాగుతోంది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశాలను పరిశీలిస్తున్నారు. అధిష్టానంతో దగ్గర సంబంధం ఉన్న నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

6లో ▶

## ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కీలక మలుపు

**- నిందితుల జాబితాలో కేజ్రీవాల్, ఆప్‌ని చేర్చిన ఈడీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ ఢిల్లీ లిక్కర్ కేసు సంచలనంగా మారింది. ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోంది. పార్టీ అగ్రనేతలు సైతం జైలుకు వెళ్లారు. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ లభించడంతో ఆయన ఆప్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

6లో ▶

## ఈడీ సీజ్ చేసిన డబ్బు పేదలకు పంచుతాం

**- ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గత కొన్నేళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఈడీ పేరు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేశంలోని చాలా పార్టీల నేతల ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించి కోట్ల కొద్ది గుట్టలు గుట్టలుగా డబ్బులు స్వాధీనం చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఈడీని పావుగా వాడుకుని రాజకీయ ప్రతీకారం

6లో ▶

## ఇక టీఎస్ స్థానంలో టీజీ

**- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలలో రాష్ట్రం కోడ్ అబ్రివేషన్ మార్చడం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ కోడ్ టీఎస్ గా నిర్ణయించగా, అదే కొనసాగుతోంది. అయితే రాష్ట్రంలో గత డిసెంబర్ లో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ పేరును టీజీగా మార్చాలని నిర్ణయించింది. గత కేబినెట్ భేటీలో తెలంగాణ స్టేట్ (టీఎస్) బదులుగా తెలంగాణ గవర్నమెంట్ (టీజీ) అని మార్చాలని డిసైడ్ చేశారు. రాష్ట్రంలో ఇకపై అన్ని ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలు, అటానమస్ సంస్థలు సైతం తెలంగాణ కోడ్ ను టీఎస్ బదులుగా టీజీ వాడాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లలో రాష్ట్ర కోడ్‌గా టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే భావించింది. ఈ మేరకు తమ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు మార్చి నెలలోనే కేంద్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ సైతం వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ టీఎస్ నుంచి టీజీగా మార్చుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతో రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌లో తెలంగాణ కోడ్‌ను టీజీగా మారింది. కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో అనుమతి రావడంతో వాహనాల రిజిస్ట్రేషన్లతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంబంధిత అంశాలలో రాష్ట్రం కోడ్ టీఎస్ నుంచి టీజీగా మారిపోయింది.

### కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణపై సమీక్ష చేశారు. ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొంతమంది జిల్లాల కలెక్టర్లు తీసుకున్న చర్యలను సీఎస్ అభినందించారు. ఇదే విధానాన్ని అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా రైతులు నష్టపోకుండా ఉండేలా అన్ని జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని

6లో ▶

## నేడే తెలంగాణ కేబినెట్ భేటీ

**- రుణమాఫీపై కీలక నిర్ణయాలు.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొద్ది రోజుల విరామం తరవాత తెలంగాణ మంత్రి వర్గం నేడు సమావేశం అవుతోంది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర కేబినేట్ సమావేశం జరుగనుంది. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్ లో ఉన్నవి, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినెట్ లో చర్చించనున్నారు. ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజనపై నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ ఇప్పటికే అధికారులను

6లో ▶

## జగన్ అలా, సజ్జల ఇలా

**- వైసీపీకి దక్కే సీట్లెన్ని.?**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. తాము 2019 కంటే మెజార్టీ సీట్లతో విజయం సాధిస్తామని ముఖ్యమంత్రి జగన్ ధీమాగా ఉన్నారు. కానీ, జగన్ మాటలు ప్రత్యర్థి కూటమి ప్రచారానికి కౌంటర్ గా కేడర్ లో విశ్వాసం నింపటం కోసమేనని ప్రచారం సాగుతోంది. కానీ, వైసీపీ నేతలు మాత్రం జగన్ ఏది మాట్లాడినా ప్రచారం కోసం ఉండదని చెబుతున్నారు. ఈ సమయంలోనే వైసీపీ ముఖ్య నేత సజ్జల ఎన్నికల ఫలితాల పైన కీలక వ్యాఖ్యలు చేసారు.

### గెలుపుపై ధీమా

ముఖ్యమంత్రి జగన్ తాము 2019 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తామని ధీమాగా చెప్పారు. నాడు గెలిచిన 151 అసెంబ్లీ, 22 ఎంపీ సీట్ల కంటే ఎక్కువ వస్తాయని విశ్వాసం వ్యక్తం చేసారు. దీని పైన సొంత పార్టీలో, ప్రత్యర్థి కూటమిలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కేడర్ లో మనోధైర్యం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేసారనే వాదన ఉంది. ఇదే సమయంలో జగన్ అంచనాలు లేకుండా చెప్పరనే మరో వాదన వినిపిస్తోంది. ఈ సమయంలోనే పార్టీ ముఖ్య నేత సజ్జల ఎన్నికల అంచనాలపైన స్పందించారు. జగన్ చేసిన వ్యాఖ్యలకు కొనసాగింపుగా తమ నమ్మకం

6లో ▶

## పోలింగ్ అనంతరం హింసపై కఠిన చర్యలు

**- ఈసీ ఆదేశాలతో సిట్ ఏర్పాటు**

- ఏపీలో పోలింగ్ వేళ, పోలింగ్ ముగిశాక అల్లర్లు
- తీవ్రంగా పరిగణించిన కేంద్ర ఎన్నికల సంఘం
- హింసాత్మక ఘటనలపై సిట్ ఏర్పాటు చేయాలంటూ ఈసీ ఆదేశం
- రెండ్రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశం



అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఏపీలో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటు చేసింది. ఈ బృందానికి వినీత్ బ్రిజ్ లాల్ నాయకత్వం వహిస్తారు.మొత్తం 13 మంది సభ్యులతో కూడిన సిట్ ను ఏర్పాటు చేసింది. పలువురు డీఎస్పీలు, సీఐలు ఉన్నారు. అల్లర్లపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఈసీ ఇప్పటికే ఆదేశించింది. ఈ సిట్ రెండు

6లో ▶

## కేఏ పాల్‌పై చీటింగ్ కేసు

**- ఎమ్మెల్యే టికెట్ కోసం 50 లక్షలు తీసుకున్నట్టు ఫిర్యాదు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వివాదంలో ఇరుక్కున్నారు. ఆయనపై పంజాగుట్టలో చీటింగ్ కేసు నమోదయింది. రంగారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్ కుమార్ అనే వ్యక్తి కేఏ పాల్ పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఎల్బీనగర్ టిక్కెట్ ఇస్తామని చెప్పి రూ. యాభై లక్షలు తీసుకున్నారని కానీ టిక్కెట్ ఇవ్వలేదని ఆయన తెలిపారు. రూ. 30 లక్షలు ఆన్ లైన్‌లో రూ. 20 లక్షలు నగదు ద్వారా చెల్లించానని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు గత ఏడాది నవంబర్‌లోనే ముగిశాయి. ఆ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ పోటీ చేయలేదు. ఆయన పార్టీ ఇన్ యాక్టివ్ గా మారడంతో ఈసీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. కామన్ సింబల్ ఇవ్వాలంటూ కేఏ పాల్ రచ్చ చేశారు. అయితే చివరికి ఆయన ఎన్నికల్లో పోటీ చేయలేదు.

6లో ▶

## అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎప్పుడూ రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ హైవేపై వెళ్లే వాహనదారులకు శుభవార్త. హైవేపై ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడుతోంది తెలంగాణ సర్కారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర, జాతీయ రహదారుల అధికారులతో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ఎన్హెచ్ 65 రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు

6లో ▶

## తెలంగాణలో యుద్ధం ఇంకా మిగిలే ఉంది

**- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్న కేసీఆర్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో యుద్ధం ఇంకా మిగిలే ఉందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రాజకీయ, సామాజిక అంశాల్లో వచ్చిన మార్పులు, రాష్ట్ర ప్రగతి తదితర అంశాలపై తెలంగాణ ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ ఎడిటోరియల్ వ్యాసాలతో రూపకల్పన చేసిన 'సన్ ఆఫ్ ద సాయిల్' (భూమి పుత్రుడు) పుస్తకాన్ని కేసీఆర్ శుక్రవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఉద్యమ శక్తులను మరోసారి పునరేకీకరణ చేసి కార్యక్షేత్రానికి రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో భావవ్యాప్తితో ఉద్యమం ఉధృతమైందన్నారు. మరోసారి కవులు, కళాకారులు ఏకం కావలసిన అవసరం ఉందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమనదిశగా తీసుకెళుతోందన్నారు. కర్షకులు, కార్మికులు, నిరుద్యోగులు వివిధ వర్గాలు కాంగ్రెస్ పాలనలో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల తెలంగాణలో ప్రజలకు చిన్న ఇబ్బంది కలగకుండా పాలన చేశామన్నారు. ఈ సందర్భంగా 'సన్ ఆఫ్ సాయిల్' పుస్తక రచయిత గోసుల శ్రీనివాస్ యాదవ్‌ను కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ ప్రగతిని సాధారణ శైలిలో, ప్రజలకు అర్థమయ్యేలా వివరించారన్నారు. త్వరలో ఉద్యమ రచయితలతో ఒక సమావేశం పెట్టుకుందామని, రచయితలకు అన్ని విధాలుగా తోడుగా ఉంటానని, రచయితలు ప్రజల పక్షాన ఉండాలని పిలుపునిచ్చారు.

# అన్నం రాజమల్లు నీకు తగునా

**- సీతంపేటలో ఇటు ప్రభుత్వ భూమి అటు ఎస్సారెస్పీ భూమి కబ్జా చేసిన ఘనుడులి**

**- చోద్యం చూస్తున్న అధికారులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**



**మంథని ( ప్రశ్న న్యూస్)** ముత్తారం అన్నం రాజమల్లు నీకు తగునా అంటున్నారు. మండలంలోని సీతంపేట గ్రామ ప్రజలు.గ్రామస్తుల కథనం ప్రకారం సీతంపేటలో ఇటు ప్రభుత్వ భూమిని... అటు ఎస్సారెస్పీ భూమి ని కబ్జా చేసిన అన్నం రాజమల్లు ఆ ప్రభుత్వ భూమి పైనే కన్నేసి కాజేస్తున్నాడు. సీతంపేట లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన స్మశాన వాటికను కూల్చేందుకు నానా ప్రయత్నం చేస్తూ ఫిర్యాదులు చేసిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పిర్యాదు దారులు వాపోతున్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగానే ఉన్న తన ఇంటిని ఏకంగా ఎస్సారెస్పీ కెనాల్ ను దర్జాగా కబ్జా చేసి ఇంటిని నిర్మించాడని, రైతులకు ఉపయోగపడే ఎస్సారెస్పీ కెనాల్ ను కబ్జా చేశాడని రాజమల్లుపై ఇదివరకే గ్రామస్తులు ఫిర్యాదు చేయగా అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామ ప్రజలు అధికారుల పై ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. రాజమల్లు ఇచ్చే అమ్య ఆమ్యాలకు లాలూచీపడి అధికారులు కబ్జా చేసిన భూములను అతని నుంచి స్వాధీన తీసుకోవాల్సింది పోయి, రాజమల్లు కే వత్తాసు పలుకుతూ, తప్పుడు పత్రాలు సృష్టించి గ్రామస్తులను, రైతులను ఇబ్బందులు పెడుతున్నారని గ్రామ ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అన్నం రాజమల్లు అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని, ఎస్సారెస్పీ భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే జిల్లా కలెక్టర్ కు మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

**మంథనిలో అక్రమ నిర్మాణమే**

మంథని పట్టణంలో కూడా అన్నం రాజమల్లు గతంలో గ్రామ పంచాయతీ భూమిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అందులో దాదాపు కోటి రూపాయల విలువ చేసే ఇల్లు నిర్మించాడని ఆ ఇంటికి ఇప్పటికి కూడా సరైన ధ్రువపత్రాలు లేవని గ్రామస్తులు తెలిపారు. మంథనిలో అక్రమంగా నిర్మించిన ఇల్లు పై కూడా త్వరలో ఫిర్యాదు చేయనున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

# శేరిలింగంపల్లి లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ఆదేశాలు జారీ

**- జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్**



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** శేరిలింగంపల్లి జోన్ లో నిన్న కురిసిన భారీ వర్షం నేపథ్యంలో పలు ప్రాంతంలో ఆకస్మిక పర్యటన నిర్వహించిన జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్.బయో డైవర్సిటీ, క్యూ మార్టు,డి ఎల్ ఎఫ్ రోడ్డు వరద నీరు సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అవసరమైన బాక్స్ డ్రెయిన్ నిర్మాణాలు వెంటనే చేపట్టాలని శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటుగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్, యస్ డబ్లు డి, డి సి వేణుగోపాల్ రెడ్డి ,ఈ ఈ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

**- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్**




**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** శేరిలింగంపల్లి సీనియర్ నేత,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకను ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ ఘనంగా జరుపుకున్నారు.ఈ మేరకు దీప్తి శ్రీనగర్ షిరిడి సాయి వృద్ధాశ్రయంలో అన్నదానం నిర్వహించారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఘనంగా కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు,ఎల్లేష్, రమేష్ రాజేష్ గౌడ్,అశోక్, రవి ముదిరాజ్, శ్రీనివాస్,శ్రీధర్ గౌడ్, బాబు,శివ, నరసింహ, విజయలక్ష్మి,జ్యోతి,సుశీల, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జన సమితిలో చేరిన ఇమామ్ హుస్సేన్

**- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కోదండరాం**



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** ఆల్ ఇండియా వుమెన్ ఎంపవర్మెంట్ పార్టీ (ఏఐఎంఈపి) పార్టీకి చెందిన శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ఇమామ్ హుస్సేన్ తెలంగాణ సమితి పార్టీలో శుక్రవారం నాంపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇమామ్ హుస్సేన్ ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా హిమాం హుస్సేన్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల కు కట్టుబడి ఆకర్షితులమయ్యామని అందువల్లనే ఏఐఎంఈపి పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ సమితిలో చేరినట్లు వెల్లడించారు.పార్టీ ఆదేశాల మేరకు కట్టుబడి పార్టీ పిలుపు మేరకు పనిచేస్తానని ఇమామ్ హుస్సేన్ పేర్కొన్నారు.పార్టీ కార్యకర్తగా తెలంగాణ జనసమితి పార్టీ బలోపేతానికి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.ఈ మేరకు ఆయనతో పాటు పార్టీలో గ్రేటర్ రాయలసీమ మాజీ అధ్యక్షులు ఓబుల్ రెడ్డి,డాక్టర్ కోటయ్య, సురేష్ బాబు,ప్రసాద్, తదితరులు పార్టీలో చేరారు.

# గెలిస్తే అర్జునుడిని ఓడిపోతే అభిమన్యుడిని



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ లో పోటీ చేయడం పద్మవ్యూహంలో చిక్కడమే అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ,నిజామాబాదు పార్లమెంట్ స్థానం లో కాంగ్రెస్ ని నిల్వరించడానికె బీజేపీ, బి ఆర్ ఎస్ పార్టీలు కుట్ర పన్నాయని ఆరోపణలు చేశారు.నిజామాబాదులో పోటీ చేయడం పద్మవ్యూహంలో చిక్కడమేనని,గెలిస్తే అర్జునుడిని ఓడితే అభిమాన్యుడిని అంటూ ఎమోషనల్ అయ్యారు. గెలిచినా, ఓడినా జగిత్యాల ప్రజల అభిమానం చాలు నాకు రాజకీయ జన్మనిచ్చింది జగిత్యాల అని వెల్లడించారు. బీజేపీ పార్టీ సిద్ధాంతం, ఆర్థికప్రణాళిక లేని పార్టీ,బీజేపీ ఫలిత రాష్ట్రాల్లో తెలంగాణలో అమల్యయే ఏ ఒక్క పథకం అయిన అమలవుతుందా ? అని ప్రశ్నించారు.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రైతు దీక్షల పేరిట ధర్నాలు చేయడం దెయ్యాలు వేదాలు వాళ్ళించినట్టు ఉందని ఫైర్ అయ్యారు. నాకు పదవులు ఇవ్వడం లేదంటూ%%రేవంత్ పై జీవన్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. నా హెూదా కు తగ్గా పదవి ఇచ్చే పరిస్థితుల్లో లేరు, నా రాజకీయ జీవితంలో నా హెూదాకు చిన్న పదవి నేను తీసుకోను అని చెప్పారు. కొట్లాడాలి నా జీవితంలో చివరి యుద్ధం చేశానని వెల్లడించారు జీవన్ రెడ్డి.

# అన్నదమ్ములను బలిగొన్న భూ తగాదా



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** భూ తగాదాల నేపథ్యంలో జరిగిన గొడవ ఓ కుటుంబంలో విషాదం నింపింది. ఇద్దరు అన్నదమ్ముల కుమారులు మృతి చెందడంతో జగిత్యాల జిల్లా గోపులాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన దివిటి శ్రీనివాస్ రెండేళ్ల క్రితం తన ఇంటి పక్కనే మరో ఇంటిని కొనుగోలు చేశాడు. దాని పక్కనే అదే గ్రామానికి చెందిన బుర్రా నవీన్ ఇల్లు కూడా ఉంది. దీంతో ఇంటి రహదారి విషయంలో నవీన్, శ్రీనివాస్‌కు తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి శ్రీనివాస్, నవీన్ కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవ జరిగి సద్దుమణిగింది. అనంతరం శ్రీనివాస్ తన పెదనాన్న కుమారుడు మహేష్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరు మాట్లాడుకుంటుండగా,నవీన్ కొంతమంది యువకులను తీసుకొచ్చి, శ్రీనివాస్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీనివాస్(36) అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డువచ్చిన మహేష్‌పై కూడా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి.అతడిని వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేష్‌కు కుమారుడు, భార్య ఉన్నారు. శ్రీనివాస్ సోదరి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని అదనపు ఎస్పీ వినోద్ కుమార్ పరిశీలించారు

# సమస్యలను పరిష్కరిస్తాం

**- లింగారెడ్డి గూడ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**- కాలువ నిర్మాణానికి కావలసినన్ని నిధులు ఇస్తాం**

**- భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉండేలా ప్రణాళిక ఏర్పాటు చేస్తాం**

**- రాజకీయ నిరుద్యోగుల విమర్శలను పట్టించుకోము**



**షాద్ నగర్ (ప్రశ్న న్యూస్)** ఫరూక్నగర్ మండల పరిధిలోని లింగారెడ్డి గూడ గ్రామాన్ని వీర్లపల్లి శంకర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు



ఆలోచన లేకుండా, పరిపాలన అనుభవం లేకుండా, పరిపక్వత లేని పనులు చేశారని మురికి కాలువను సైతం శుభ్రం చేయకుండా పది సంవత్సరాలుగా గాలికి వదిలేసి ఇప్పుడు ఎదుటివారిపై నిందలు మోపడం ఎంతవరకు సమంజసం అని, ఇది వారి అపరిపక్వత నాన్ని తెలియజేస్తుందని అన్నారు. డ్రైనేజీ పైపుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉంటే వాటిని తీయొద్దని ఎవరైనా అన్నారా అని ప్రశ్నించారు. గతంలోని ఎంపీటీసీ చేసిన విమర్శలను పట్టించుకోమని అటువంటి వాటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని వారు చేసిన తప్పును తమపై రుద్దడం సబబు కాదని అన్నారు. మిమ్మల్ని అడ్డుకున్నది ఎవరు? నిధులు మంజూరు చేయకుండా ఆపింది ఎవరు అని ప్రశ్నించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ పోయి అభివృద్ధి వైపు అడుగులు వేయాలే కానీ ఒకరిపై నెపంవేసి పబ్బం గడుపుకోవాలని చూడడం సబబు కాదని, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన నిధులు కాలువ నిర్మాణానికి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని, కావాల్సింది నిధులు సమకూరుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేష్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు

# పౌల్ట్రీ రైతులను ఆదుకోండి

**- పౌల్ట్రీ రైతులకు ప్రాపర్టీ టాక్స్ మినహాయింపు కల్పించండి**

**- మంత్రికి వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్ (ప్రశ్న న్యూస్)** పౌల్ట్రీ రైతులపై విధించినటువంటి ప్రాపర్టీ టాక్స్ నుండి పౌల్ట్రీ రైతులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావునీ కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి పత్రం అందజేశారు. పాత బకాయిల వసూలు దృష్ట్యా షాద్నగర్ మున్సిపాలిటీ పౌల్ట్రీ రైతులకు జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని మంత్రికి విన్నవించినట్టు తెలిపారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న విధానాన్నే కొనసాగిస్తూ పాత బకాయిలను రద్దు చేయవలసిందిగా కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పౌల్ట్రీ రైతులను ఆదుకొనవలసిందిగా మంత్రి ని కలిసి ప్రత్యేకంగా కోరడం జరిగిందని తెలిపారు.

# అంగన్వాడీ టీచర్ మర్డర్ 72 గంటల్లోనే చేదించిన పోలీసులు



**ములుగు (ప్రశ్న న్యూస్ )**ములుగు జిల్లా తాడ్వాయి మండల లోని కాటాపూర్ గ్రామం అంగన్వాడీ టీచర్ ఈనెల 14 న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ములుగు డి.ఎస్.పి ఎన్ రవీందర్ ఈ కేసు వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ములుగు డిఎస్పి రవీందర్, పస్రా సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి లు మాట్లాడుతూ మృతు రాలి కొడుకు రణం చరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పస్రా సిఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి సీసీ ఫుటేజ్ ఆధారంగా వారి కాల్ డేటా ఆధారంగా పూర్తి ఆధారాలు సేకరించి నింది తులను పట్టుకున్నట్లు తెలిపారు. చిన్న బోయినపల్లి గ్రామానికి చెందిన రడం సుజాత ఈనెల 14వ తారీఖున అంగన్వాడిలో విధులు నిర్వహించుకుని తిరిగి వారి స్వగ్రామమైన చిన్నబోయి నపల్లికి బయలుదేరింది. ఆర్టీసీ బస్సు మిస్ కావడం తో అంతకుముందే పరిచ యం ఉన్న ఆకుదారి రామయ్య బైకుపై నాంపల్లి గ్రామ శివారులోని నీళ్ల గొర్రె వద్ద దించడం జరిగింది. అంతకుముందే అక్కడే ఉన్నా పగిడి జంపయ్య నీలవరి వద్దకు మృతురా లని తీసుకెళ్లి అక్కడ ఆకుదారి రామయ్య, పగిడి జంపయ్య ఇద్దరూ ఆమెను అడవిలో కొద్దిదూరం తీసుకెళ్లి అత్యాచారం చేసి, ఆమె మెడలోని బంగారు గొలుసు తాడును లాక్కునే ప్రయత్నం చేశారు. ఆమె ప్రతిఘటించడంతో పగిడి జంపయ్య ఆమె తలపై రాయితో కొట్టి, ఆమె స్కార్ఫ్ తో మెడకు చుట్టి హత్య చేసి, మృతురాలి మెడలో నుంచి మూడు తులాల బంగారం గొలుసు తీసుకొని హ్యాండ్ బాగ్ ను మొబైల్ ఫోన్ను అడవిలో దూరంగా పడేసి తిరిగి వారి రొయ్యూరు గ్రామానికి వెళ్లి పోయినట్లు తెలిపారు. కాగా నేడు శుక్రవారం 17వ తారీకు రోజున ఉదయం కాటాపూర్ క్రాస్ వద్ద పస్రా సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తో వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్ పై తాడ్వాయి వైపు నుండి వస్తున్నటువంటి ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. కాగా నిందితులు రొయ్యూ రు గ్రామానికి చెందిన ఆకుదారి రామయ్య (45), పగిడి జంపయ్య (42) గా నిందితులను గుర్తించినట్లు తెలిపారు. నిందితుల నుండి మోటార్ సైకిల్ హీరో గ్లామర్ టీఎస్ 16 ఈ కే 3264, మూడు తులాల పుస్తెలతాడు, పుస్తెలు హ్యాండ్ బ్యాగ్ మృతురాలి బ్యాంక్ పాసుబుక్ ఆధార్ కార్డును స్వాధీనం పరుచు కున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. కాగా చాకచక్యంగా వ్యవహరించి అది తక్కువ సమయంలో నిధులను పట్టుకున్న పస్రా సిఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఏఎస్సై చింత నారాయణ, హెచ్ సి కిషన్, పిసి పూజారి రమేష్, జాజ సాంబయ్య, అప్పాల రమేష్, గోపు రాజీవ్, కాసగోని రాజేష్ పోలీసు లను ఉన్నతాధికారులు అభినందించారు

# వైసీపీ నాయకుల ఆగడాలను అరికట్టాలి

**- జాలారి గోపాల్ పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**- రౌడీ షీటర్ విష్ణువర్ధన్ రెడ్డి పై 307 సెక్షన్ పెట్టాలి**

**- గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్**



**నెల్లూరు బ్యూరో( ప్రశ్న న్యూస్ )** చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో జాలారి గోపాల్ పై దాడి చేయించిన వైసీపీ నాయకుల పై కఠిన చర్యలు తీసుకోవాలని దీనిపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మె ల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో టిడిపి పార్టీకి మద్దతు ఇచ్చారని జాలారి గోపాల్ ను విచక్షణారహితంగా దాడి చేశారని అతను ప్రాణాపాయ పరిస్థితుల్లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈ దాడికి కారణమైన వైసీపీ నాయకులు రౌడీ షీటర్ విష్ణువర్ధన్ రెడ్డి పై వారిపై 307 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి జైల్ కి పంపాలనిడిమాండ్ చేశారు.అక్రమ గ్రావెల్ తరలిస్తున్నా,రౌడీయిజం చేస్తున్నా పోలీసు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.జరిగిన హింసాత్మక సంఘటనలకు కారకులైన వారిపై కాకుండా బాధితులపై నే డిఎస్పీ తప్పుడు కేసులు కట్టించడం మంచి పద్ధతి కాదన్నారు.ఎమ్మెల్సీగా నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేసావో చెప్పగలవా అని ప్రశ్నించారు. తిరుపతి టిడిపి పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు నరసింహులు యాదవ్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే గూడూరు నియోజకవర్గంలో ఎన్నికలు అయిన అనంతరం వైసిపి నాయకులు ఇలా దాడులు చేయడం అమానుషమని వెంటనే దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్ కు కూడా ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు చిల్లకూరు మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి,టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య ,పట్టణాధ్యక్షులుపులిమి శ్రీనివాసులు ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు రహీం ,ఉమాశంకర్, రవీందర్ రెడ్డి,నిమ్మకాయల నరసింహులు ,తదితరులు పాల్గొన్నారు .

## బేగంపేట సర్కిల్‌లో కొనసాగుతున్న

# అక్రమ నిర్మాణాలు

- ప్రజా ప్రతినిధుల అండదండలతో నిబంధనలకు పాతర
- అనుమతులు లేకుండానే అదనపు అంతస్తుల నిర్మాణాలు - రోడ్డున కబ్జా చేసి లిఫ్ట్ నిర్మాణం





**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** బేగంపేట సర్కిల్ పరిధిలోని పలు డివిజన్ లలో విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతునే ఉన్నాయి. అధికారులు అక్రమ నిర్మాణాలంటూ తూతూ మంత్రంగా కూల్చివేయడంతో యథేచ్ఛగా తిరిగి నిర్మాణాలు చేసుకుంటున్నారు. ఇదేమంటే తమకు స్థానిక ప్రజాప్రతినిధులే అండగా ఉన్నారంటూ బహిరంగంగానే చెప్పుకుంటూ ఇష్ట రాజ్యాంగ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. పలు డివిజన్ లలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాన్ని చేపట్టారంటూ అధికారులు కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని మౌనం వహించడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బేగంపేట సర్కిల్ పరిధిలో చైన్ మెన్ లే అక్రమ నిర్మాణాలను పెంచి పోషిస్తున్నారని లక్షలలో లంచాలు తీసుకుని అక్రమ నిర్మాణాలు చేయించడం బేగంపేట సర్కిల్ పరిధిలో ఉన్న చైన్ మెన్ లకు పరిపాటిగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తొలగించినా రోజుల వ్యవధిలోనే తిరిగి నిర్మాణానికి పూనుకున్నారు. లీజ్ ల్యాండ్ భూములలో సైతం అక్రమ మార్గంలో నిర్మాణాలు చేస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులకు బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు లక్షలలో లంచాలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు కాలనీలోని పలు నిర్మాణాలను జోరుగానే కొనసాగుతున్నాయి. 7-2-663, సుభాష్ రోడ్డు సికింద్రాబాద్, ఆపోజిట్ ఉజ్జయిని మహంకాళి కమాన్ అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని రోడ్డు కబ్జా చేసి లిఫ్ట్ నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్కిల్ పరిధిలో పాత భవనాల పైనే మేడ మీద మేడ నిర్మాణం పనులను కొనసాగుతున్నాయి. పైగా అనుమతులు లేకుండా ఎవ్వరు నిర్మాణాలు చేపట్టడం లేదా... అన్ని నిర్మాణాలపై చర్యలు తీసుకోంటే తమ నిర్మాణం పట్ల చర్యలు తీసుకోవాలంటూ సదరు నిర్మాణదారుడు దర్జాగా ఆదనపు అంతస్తుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల అనుమతులతో నే నిర్మాణ పనులు చేపడుతున్నాట్లు చెప్పడం విశేషం. కాగా మున్సిపల్ అధికారుల అండదండలు మెండుగా ఉండటంతోనే నిర్మాణపనులు దర్జాగా కొనసాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బేగంపేట సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల పట్ల ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# టీమిండియా కోచ్‌కు పోటా పోటీ

**ముంబై :** టీమిండియా కోచ్ పదవికి పలువురు సీనియర్ క్రికెటర్లు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే బీసీసీఐ మదిలో ఏముందో ఎవరికి తెలియడం లేదు. ఎవరికి చెవిలో చెప్పి, అప్లై చేయమని సలహాలిస్తున్నారో కూడా తెలీడం లేదు. అయితే చాలామంది అనుకునేదేమిటంటే.. డైరెక్టుగా బీసీసీఐ నుంచి అనధికారికంగా అయినా ఫోను వస్తే, అప్పుడు చూద్దామనే లెక్కలో కొందరు ఉన్నారని అంటున్నారు

### వివివిఎస్ లక్ష్మణ్ కి ఆసక్తి ఉందా? లేదా?

ప్రస్తుతం లక్ష్మణ్ నేషనల్ క్రికెట్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అద్భుతమైన బ్యాటింగ్ క్రికెట్ ప్రపంచంలో తనదైన ముద్రవేసిన అతను ద్రవిడ్ తర్వాత టీమిండియాకు ప్రధాన కోచ్ బహుశా లక్ష్మణ్ కావచ్చునని అంటున్నారు. ద్రవిడ్ సెలవులో ఉన్నప్పుడు లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశాడు.

జస్టిన్ లాంగర్ అయితే బెటర్?

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్. అలాగే 2023 వన్డే వరల్డ్ కప్ ఆస్ట్రేలియా సాధించడంలో కోచ్ గా తన పాత్ర ఎంతో కీలకంగా ఉంది. అంతేకాదు ఆస్ట్రేలియా పలు విజయాల్లో జస్టిన్ లాంగర్ పాత్ర ఉంది. గతంలో విదేశీ కోచ్ లు ఉన్నప్పుడే మనవాళ్లు ఐసీసీ ట్రోఫీలు గెలిచారు. అందుకని ఈసారి విదేశీ కోచ్ లని తీసుకోవాలని అనుకుంటే మాత్రం జస్టిన్ లాంగర్ బెటర్ ఛాయిస్ అని అంటున్నారు.

### చెన్నై కోచ్.. స్టీఫెన్ ఫ్లెమింగ్

న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రస్తుతం ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ గా ఉన్నాడు. ధోనీతో మంచి కెమిస్ట్రీ ఉండటంతో చెన్నయ్ ని తొమ్మిదిసార్లు ఫైనల్ వరకు తీసుకువెళ్లాడు. అంతేకాదు ఐదుసార్లు ట్రోఫీ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. తన ప్లానింగ్, ఆలోచనలు, వ్యూహాలు కలిసి రావడం వల్లే చెన్నయ్ ఇప్పుడు కూడా ప్లే ఆఫ్ రేస్ లోనే ఉండటం విశేషం. అయితే మహేంద్ర సింగ్ ధోనీ కూడా ఫ్లెమింగ్ పేరుని బీసీసీఐకి రికమండ్ చేశాడనే టాక్ ఒకటి నెట్టింట వినిపిస్తోంది.

### ఫైర్ బ్రాండ్ గౌతమ్ గంభీర్

గొప్ప క్రికెట్ బుర్రగా అందరూ కొనియాడే గౌతమ్ గంభీర్ కూడా భారత హెడ్ కోచ్ రేస్ లో ఉన్నాడు. కాకపోతే నోటి దురద బాగా ఎక్కువ. చిన్నా పెద్దా చూసుకోడు. ముందూ వెనుకా చూసుకోడు. మంచీ చెడ్డా చూసుకోడు. తనకి ఆ క్షణం ఏదనిపిస్తే అది అనేస్తాడు. తర్వాత ఎంత రచ్చయినా పోరాడతాడు తప్ప వెనుకడుగు వేయడు. అలాంటి మొండి ఘటం కోచ్ గా కరెక్టేనా? అంటున్నారు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మతో మంచి అనుబంధం ఉంది. కోహ్లీతో గొడవలున్నా సర్దుకున్నారు. కోల్ కతా కెప్టెన్ గా ఉండి రెండుసార్లు ట్రోఫీ అందించాడు. ప్రస్తుతం మెంటార్ గా ఉండి ప్లే ఆఫ్ కి తీసుకువెళ్లాడు.

### ఫాస్ట్ బౌలర్.. ఆశిష్ నెహ్రా

ఇండియన్ క్రికెట్ లో ఒకనాటి ఫాస్ట్ బౌలర్లలో ఆశిష్ నెహ్రా కూడా ఒకడు. అయితే సౌమ్యుడు, వివాదాలకు దూరంగా ఉంటాడు. ఒకసారి మహేంద్ర సింగ్ ధోనీ తనని బూతులు తిట్టాడని అన్నాడు. కాకపోతే ఇలా అంతర్గత వ్యవహారాలని ఎప్పుడైనా బయటపట్టే మనస్తత్వం ఉన్నవాళ్లని కోచ్ గా తీసుకోరని అంటారు.

ఎందుకంటే భవిష్యత్తులో భారత్ క్రికెట్ బొక్కలన్నీ బయటకి వస్తే ప్రమాదమని భావిస్తే, నెహ్రాకి అవకాశం ఉండకపోవచ్చు. ప్రస్తుతం గుజరాత్ హెడ్ కోచ్ గా ఉన్నాడు. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో గుజరాత్ కి ట్రోఫీ అందించడమే కాదు, ఒకసారి ఫైనల్ కి కూడా తీసుకువెళ్లాడు.
వీరే కాకుండా ఢిల్లీ కోచ్ గా ఉన్న రికీ పాంటింగ్ పేరు కూడా బీసీసీఐ లిస్టులో ఉందని అంటున్నారు. మరి ఎవరికి అవకాశం వస్తుందో ఎదురుచూడాల్సిందే.

# కొరడా ఝులిపిస్తున్న ఏసీబీ

**హైదరాబాద్ :** ఏసీబీ అధికారులు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. లంచం తీసుకుంటున్న అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం ఒక్కరోజే ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. వీరిలో ఒకరు వ్యవసాయ శాఖకు చెందిన వారు కాగా.. మరో ఇద్దరు విద్యుత్ శాఖకు చెందినవారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంలో ఓ రైతు నుంచి లంచం డిమాండ్ చేసిన ఎన్పీడీసీఎల్ ఏఈని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అశ్వారావుపేటకు చెందిన రైతు కొనకళ్ల జనార్ధన్ తనకు మద్దికొండలో ఉన్న పొలానికి విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు కోసం మీసేవా కేంద్రం ద్వారా రూ.లక్ష చలానా తీసి విద్యుత్ శాఖకు చెల్లించారు. అయితే, 2 నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించలేదు. మరో రూ.లక్ష లంచం ఇవ్వాలని ఎన్పీడీసీఎల్ ఏఈ ధరావత్ శరత్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విసిగిపోయిన రైతు కుమారుడు ఆదిత్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో సదరు అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు వల పన్నారు. గురువారం సాయంత్రం స్థానిక పేపర్ మిల్లు సమీపంలో ఆదిత్య నుంచి ఏఈ శరత్ లంచం తీసుకుంటుండగా.. అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

**నల్గొండ జిల్లాలో..** అలాగే, రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం వనస్థలిపురానికి చెందిన రైతు రవిసూర్యనారాయణకు నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లిలో వ్యవసాయ భూమి ఉంది. పొలానికి, ఇంటికి విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి 2022లో డీడీలు తీసి చింతపల్లి సబ్ స్టేషన్ లో అందించారు. అనంతరం మల్లారెడ్డిపల్లిలోని ఆర్టిజన్ ఉద్యోగి నడింపల్లి వేణుకుమార్ ను సంప్రదించగా.. కనెక్షన్ ఇచ్చేందుకు రూ.50 వేలు డిమాండ్ చేశారు. మొదట రూ.20 వేలు పని పూర్తైన అనంతరం రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించారు. ఒప్పందం మేరకు గురువారం చింతపల్లిలోని సాయిబాబా దేవాలయం వద్దకు వస్తే డబ్బులిస్తానని వేణుకుమార్ ను రైతు రప్పించారు. అక్కడ రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

**వ్యవసాయ ఉద్యోగి సైతం** అటు, నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర క్యాంపు గ్రామానికి చెందిన వంగ నరేశ్.. మెదక్ జిల్లా నర్సాపూర్ లో ఎరువుల దుకాణం ఏర్పాటు చేసేందుకు ట్రేడ్ లైసెన్స్ కోసం ఈ ఏడాది మార్చిలో వ్యవసాయాధికారి అనిల్ కుమార్ కు దరఖాస్తు చేశారు. అయితే, ఈ ఆర్జీని ఉన్నతాధికారులకు నివేదించేందుకు సదరు ఉద్యోగి రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు.

కాగా, నరేశ్ అప్పట్లోనే ఏసీబీని సంప్రదించగా.. ఉద్యోగి అనిల్ కదలికలపై నిఘా పెట్టారు. గురువారం నర్సాపూర్ లోని రైతు వేదికలో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

**టోల్ ఫ్రీ నెంబర్ ఇదే..** ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం అడిగితే.. అది ఎక్కువా, తక్కువా అని ఆలోచించొద్దని.. తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.

# జగన్ ధీమా కారణం ఏమిటో

**విజయవాడ :** జగన్ ధీమాతో ఉన్నారా? ఆయన లెక్క ఆయనకు ఉందా? అందుకే కాన్ఫిడెంట్ గా కనిపిస్తున్నారా? లేకుంటే పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే ఆ ప్రయత్నమా? పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఎన్నికల్లో సూపర్ విక్టరీ సాధిస్తానని జగన్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా వైసీపీ విజయం.. సంచలనంగా మారుతుంది అని కూడా తేల్చి చెప్పారు. తాజాగా ఆయన ఐ ప్యాక్ టీం సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.గత ఎన్నికల ముందు నుంచి ఐపాక్ టీం వైసీపీ కోసం పనిచేస్తోంది. ఈ టీం ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలో ఏర్పడింది. గత ఎన్నికల్లో వైసీపీకి విజయం సాధించిన తర్వాత ప్రశాంత్ కిషోర్ వ్యూహకర్త పదవిని వదులుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. సొంత రాష్ట్రం బీహార్లో రాజకీయాలు చేస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో పోలింగ్ నాడే.. సీఎం జగన్ ప్రశాంత్ కిషోర్ ను కలిసారు. సూపర్ విక్టరీ కొట్టామని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అయితే ఈసారి మాత్రం వైసీపీలో ఆ ధీమా కనిపించలేదు. గతం మాదిరిగా ఐపాక్ టీం అధినేత రుషిరాజ్ సింగ్ ను జగన్ కలవలేదు. దీంతో ఒక రకమైన చర్చ ప్రారంభమైంది. అందుకే ఈరోజు జగన్ విజయవాడ బెంజ్ సర్కిల్ లో ఉన్న ఐ ప్యాక్ కార్యాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించినట్లు తెలుస్తోంది.ఈ సమావేశంలో జగన్ హాట్ కామెంట్స్ చేశారు. రేపు ఫలితాలను చూసి దేశం షాక్ కు గురవుతుందని చెప్పుకొచ్చారు. ఆసక్తికర ఫలితాలు వస్తాయని కూడా తేల్చి చెప్పారు. దీంతో ఇదో వైరల్ అంశంగా మారింది. పోలింగ్ శాతం పెరగడం, ఉద్యోగ ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత, వంటి కారణాలతో వైసిపి శ్రేణులు డీలా పడ్డాయి. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా 81.86% ఓటింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ వరకు నువ్వా నేనాఅన్నట్టు సమరం సాగింది. అందుకు తగ్గట్టుగానే ఓటింగ్ సైతం జరిగింది. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలి రావడంతో ఓటమికి అనుకూలమని ప్రచారం ప్రారంభమైంది. దీంతో జగన్ సైతం అలెర్ట్ అయ్యారు. విజయంపై ధీమా వ్యక్తం చేస్తూనే.. ఓటింగ్ సరళి పై సమీక్షించి ఒక స్పష్టతకు వచ్చారు.ప్రభుత్వంపై వ్యతిరేకత, పెరిగిన పోలింగ్ వంటి అంశాలు పూర్తిగా తమకే అనుకూలిస్తాయని కూటమి అంచనా వేసింది. భారీ మెజారిటీ ఖాయమని లెక్కలు వేసింది. అయితే ఉదయానికే మహిళలు, వృద్ధులు ఓటు వేసేందుకు బారులు తీరడంతో వైసీపీలో ఆశలు చిగురించాయి. గత ఎన్నికల కంటే ఎక్కువ శాతం ఓటింగ్ నమోదు కావడంతో అదంతా ప్రభుత్వ వ్యతిరేకత అని కూటమి అంచనా వేసింది. విశ్లేషణలు కూడా అలానే వచ్చాయి. దీనికి తోడు అర్ధరాత్రి వరకు 1500 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. ఎన్నికల సంఘం అధికారికంగా లెక్కలు వెల్లడించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలుపుకొని 82% ఓటింగ్ నమోదైనట్లు ప్రకటించింది.ఏపీలోని ప్రధాన నగరాల్లో ఓటింగ్ శాతం తగ్గడం, మహిళా ఓటింగ్ పెరగడంతో అధికార పార్టీ కొత్త అంచనాకు వచ్చింది. ఐప్యాక్ టీం, సోషల్ మీడియా విభాగంతో సీఎం జగన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పోలింగ్ సరళి పై చర్చించారు. నియోజకవర్గాల వారీగా నివేదికలతో విశ్లేషించారు. కోటి 69 లక్షల మంది మహిళలు ఓటింగ్లో పాల్గొన్నారని.. వారితో పోల్చుకుంటే పురుష ఓట్లు ఐదు లక్షలు తగ్గాయని.. సంక్షేమ పథకాల ప్రధాన లబ్ధిదారులు మహిళలు కావడంతో.. వారు తప్పకుండా వైసీపీ వైపు మొగ్గు చూపుతారని జగన్ ఒక లెక్కకు వచ్చారు. టిడిపి కంచుకోట లాంటి నియోజకవర్గాల్లో సైతం మహిళలు ఎక్కువగా ఓట్లు వేశారని భావిస్తున్నారు. ఈ ధైర్యంతోనే జగన్ తాజాగా ఒక ట్వీట్ చేశారు. ఇప్పటివరకు సాగిన పాలన.. మరింత మెరుగ్గా సాగుతుందని హామీ ఇచ్చారుఈ నేపథ్యంలోనే జగన్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందుకే నేరుగా ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి ఈ కీలక ప్రకటన చేసినట్లు సమాచారం. కేవలం వైసీపీ ఓటమి చెందుతుందని వస్తున్న విశ్లేషణలు, ప్రచారానికి చెప్పేందుకే జగన్ కీలక ప్రకటన చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే జగన్ ప్రకటనతోవైసీపీ శ్రేణులు ఊపిరి పీల్చుకుంటున్నాయి.

## కుప్పం, పిఠాపురంలలో

# భారీ బెట్టింగ్స్

**కాకినాడ :** సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. తెలంగాణలో ఎంపీ సీట్లకు, ఏపీలో ఎంపీ సీట్లతో పాటు అసెంబ్లీకి పోలింగ్ జరిగింది. కానీ తెలంగాణ కంటే ఏపీలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. భారీగా హింస చెలరేగింది. పోలింగ్ ముగిసిన రెండు రోజుల వరకు కొనసాగింది. దీంతోనే అర్థమవుతుంది ఏ స్థాయిలో ఫైట్ జరిగిందో. అందుకే ఏపీ ఫలితాల పట్ల అంతటా ఉత్కంఠ నెలకొంది. దీంతో బెట్టింగులు కూడా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. భారీగా బెట్టింగ్ ముఠాలు ప్రవేశించినట్లు ప్రచారం జరుగుతోంది.వైసిపి మరోసారి అధికారంలోకి వస్తుందా? టిడిపి కూటమి అధికారాన్ని దక్కించుకుంటుందా? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఎవరు గెలుస్తారు? ఎంత మెజారిటీ వస్తుంది? అన్న అంశాల చుట్టూ బెట్టింగ్ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. కోట్లలో ఈ బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. లక్షకు ఐదు లక్షలు చొప్పున బెట్టింగ్ జరుగుతుండడం విశేషం. ప్రధానంగా ఏపీలో పిఠాపురం పైనే అందరి ఫోకస్ ఉంది. గత ఎన్నికల్లో పవన్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి మాత్రం పిఠాపురం నియోజకవర్గ నుంచి మాత్రమే పోటీ చేస్తున్నారు. అటు వైసీపీ సైతం గట్టిగానే ఫోకస్ పెట్టింది. అందుకే ఇప్పుడు పిఠాపురం చుట్టూ బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. పవన్ గెలుస్తాడా? లేదా? అన్నదానిపై జోరుగా పందాలు కొనసాగుతున్నాయి. పవన్ తరువాత లోకేష్ పైనే ఎక్కువ బెట్టింగ్ సాగుతుండడం విశేషం. మంగళగిరి నుంచి పోటీ చేసిన లోకేష్ గత ఎన్నికల్లో ఓడిపోయాడు. ఎన్నికల్లో మరోసారి పోటీ చేస్తున్నాడు. ఇక్కడ సైతం వైసిపి పట్టు బిగించాలని ప్రయత్నించింది.

అందుకే ఇక్కడ సైతం భారీ స్థాయిలో బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం.వై నాట్ కుప్పం అని వైసిపి సౌండ్ చేసింది. కుప్పంలో చంద్రబాబును ఎలాగైనా ఓడిస్తామని శపథం చేసింది. దీంతో అందరి చూపు కుప్పం వైపు పడింది. వైసిపి పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో రాజకీయంగా కుప్పం హాట్ టాపిక్ గా మారింది. అందుకే అక్కడ చంద్రబాబు గెలుస్తాడా? లేదా? అని ఎక్కువ మంది బెట్టింగ్ కాస్తున్నారు. చంద్రబాబుకు మెజారిటీ తగ్గుతుందా? లేదా? అన్న అంశంపై కూడా పందాలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు గెలుపోటములపై కాకుండా.. మెజారిటీపైనే ఎక్కువ శాతం బెట్టింగ్ జరుగుతుండడం విశేషం. అటు కడప పార్లమెంట్ స్థానంతో పాటు పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం పై కూడా బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. షర్మిల ఎంపీగా గెలుపొందుతారని.. పులివెందులలో జగన్ మెజారిటీ తగ్గుతుందని.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ సాగుతోంది. వీరితోపాటు ఏపీలో కీలక నాయకులు, వివాదాస్పద నేతలు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై సైతం బెట్టింగ్ సాగుతుండడం విశేషం. అయితే బెట్టింగులు వందల కోట్ల రూపాయలకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

# అసెంబ్లీకి ఎవరు వస్తారు...

**విజయవాడ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాక మునుపే.. రకరకాల చర్చ నడుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీకి నేతల హాజరు చుట్టూనే విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు గెలిస్తే జగన్ విపక్షనేతగా అసెంబ్లీకి వస్తారా? జగన్ గెలిస్తే చంద్రబాబు రాగలరా? పవన్ పాత్ర ఏంటి? లోకేష్ ఏం చేస్తారు? ఇటువంటివి హాట్ టాపిక్ గా మారాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. తమ గొంతు నొక్కుతుందని వైసీపీ సభ్యులు శాసనసభకు హాజరు కాలేదు. నిండు సభలో తన భార్యను అవమానించారని చంద్రబాబు శాసనసభను బాయ్ కట్ చేశారు. మళ్లీ ముఖ్యమంత్రి గానే హౌస్ లో అడుగు పెడతానని శపథం చేశారు.అయితే సీఎం అయితేనే చంద్రబాబు శాసనసభలో అడుగు పెట్టగలరు. అటు జగన్ ది అదే పరిస్థితి. అంటే అధికారంలోకి వస్తేనే వారు హౌస్ లో అడుగుపెట్టే ఛాన్స్ ఉందన్నమాట.శాసనసభ అన్నది ప్రజాస్వామ్యంలో ఒక దేవాలయం లాంటిది. ప్రజా సమస్యలు ప్రస్తావనకు వచ్చేది అక్కడే. వాటికి పరిష్కార మార్గందక్కేది అక్కడే.

కానీ అటువంటి శాసనసభ సమావేశాలను బహిష్కరించి ప్రజా సమస్యలను గాలికి వదిలేసారన్న విమర్శలు ఉన్నాయి. 2014లో టిడిపి గెలిచిన తర్వాత.. వైసీపీ ఎమ్మెల్యేలపై వేటుపడింది. రోజా లాంటిఎమ్మెల్యేలపై శాశ్విత వేటు వేశారు. దీనిని నిరసిస్తూ నాడు జగన్ మొత్తం శాసనసభనే బహిష్కరించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాతే హౌస్ లో అడుగు పెడతానని తేల్చి చెప్పారు. అందుకు తగ్గట్టుగానే గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన తర్వాత హౌస్ లో అడుగు పెట్టారు.2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. అంతకుముందు తనకు ఎదురైన ప్రతి పరిణామాన్ని రిపీట్ చేశారు. హౌస్ లో టిడిపి సభ్యులను ముప్పు తిప్పలు పెట్టించగలిగారు. ఒకానొక దశలో చంద్రబాబు వ్యక్తిగత జీవితంపై, సతీమణి పై వైసీపీ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో.. చంద్రబాబు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. అసెంబ్లీలోనే శపథం చేశారు. మళ్లీ తాను సీఎం గానే హౌస్ లో అడుగు పెడతానని తేల్చి చెప్పారు. అయితే ఇప్పుడు కూటమి గెలిస్తే ఆయన శపథం తప్పకుండా నెరవేరుతుంది.
ఒకవేళ ఓటమి ఎదురైతే మాత్రం.. ఆ బాధ్యతను పవన్ కైనా.. లోకేష్ కైనా అప్పగించే అవకాశం ఉంది. పొరపాటున వైసిపి ఓడిపోతే మాత్రం జగన్ వచ్చే పరిస్థితి ఉండదు. అంతకుముందు తన నుంచి ఎదురైన పరిణామాలు.. తనకు తిరిగిగుచ్చుకుంటాయని తెలుసు. అందుకే జూన్ 4న ఫలితాలు కేవలం అధికారం కోసమే కాదు.. ఒకరిపై ఒకరు ఉక్కు పాదం మోపేందుకే నన్న విషయం అందరికీ తెలిసిందే.

### నూతన కలెక్టరేట్ ఆవరణంలో

## ఎమ్మెల్సీ అభ్యర్థి బక్కా జడ్సన్ ధర్నా

**ఖమ్మం** ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో ఎమ్మెల్సీ అభ్యర్థి బక్కా జడ్సన్ ధర్నాకు దిగారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను , ప్రజలను కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్మెయిల్ చేస్తున్నాడని జడ్సన్ ఆరోపించారు. తీన్మార్ మల్లన్న పై చర్యలు తీసుకోవాలని నిన్న ఫిర్యాదు చేసారు. అధికారులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ లో జడ్సన్ ఆందోళనకు దిగారు. తీన్మార్ మల్లన్న డిస్క్వాలిఫై చేయాలంటూ జడ్సన్ డిమాండ్ చేసారు.

## వరద నీటితో శంఖేశ్వర్ బజాన్‌లో ఇబ్బందులు

**హైదరాబాద్** వరద నీటి కాలువ పనులు అస్తవ్యస్తంగా మారడంతో సైదాబాద్ శంఖేశ్వ ర్ బజార్ బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్తీ.సంతోష్ నగర్.చంపా పేట ల మీదుగా వచ్చే వరద నీటి కాలువను ఇటీవల ఎస్ ఎన్ డిపి ఆధ్వర్యంలో పనులు చెపట్టారు. వరద నీటి ప్రవాహాన్ని నేరుగా శంఖేశ్వ ర్ బజార్ నాలా లో కలిపారు. దింతో గురువారం కురిసిన భారీ వర్షానికి బస్తి నీట మునిగినిది. బస్తివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల లో నీరు నిలవడంతో.. స్థానికంగా ఉన్న ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులకు అనేక సార్లు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని.. స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల. కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి బస్తీని సందర్శించారు. నీరు నిల్వకుండా త్వరలో పనులు పూర్తి చేసే విధంగా ఎస్ ఎం డిపి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. యుద్ధప్రాతిపదికన నాలా క్లినింగ్ పనులు చేయాలని ఆదేశించారు.

## అత్తా, భర్తపై దాడి చేయించిన భార్య



**హైదరాబాద్** బేగంబజార్ పోలిస్ స్టేషన్ పరిధిలో కట్టేల మండీ సమీపంలో భర్త, అత్త పై భార్య బంధువులతో దాడి చేయించింది.ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తను చంపేస్తే ఆస్తి ,ఆమె ఇన్సూరెన్స్ సొమ్ము లు వేస్తాయని ప్లాన్ వేసినట్లు అనుమానిస్తున్నారు. ఇంట్లోకి చొరబడి విచక్షణారహితంగా దుండగులు దాడి చేసారు. డైల్ 100కు ఫోన్ చేసిన స్పందించలేదని బాధితుల తరుపువారు చెబుతున్నారు. స్ధానికులు చూస్తుండగానే.. కత్తులు కర్రలతో విచక్షణారహితంగా దాడి జరిగింది. దాడి ఘటన. సీసీటీవీ ఫుటేజ్ లో రికార్డ్ అయింది. తల్లి గంగా కొడుకులు రామేశ్వర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## విజయనగరంలో స్ట్రాంగ్ రూమ్ వివాదం



**విజయనగరం** విజయనగరంలో ఉద్యోగు ల పోస్టల్ బ్యాలె ట్ బాక్సులను భద్రప రిచిన స్ట్రాంగ్ రూమ్ను అధికా రులు తెరవడంపై వివాదం చెలరేగింది.తమ కు ఎలాం టి సమాచారం ఇవ్వకుండా స్ట్రాంగ్ రూమ్ను ఎలా తెరుస్తారంటూ టీడీపీ నాయకులు ఆందోళనకు దిగా రు. ఉద్యోగులు ఓటేసిన పోస్టల్ బ్యాలె ట్ బాక్సులను విజయనగరం తహసీ ల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపర్చారు. అయితే ఈ స్ట్రాంగ్ రూమ్ల ను రాత్రి అధికారులు తెరిచా రు. ఈ విషయం తెలుసుకున్న విజయ నగరం టీడీపీ శ్రేణులు అక్కడకు చేరు కుని ఆందోళన చేశారు. తమకు తెలి యకుండా స్ట్రాంగ్ రూమ్ను ఎలా తెరుస్తారంటూ అధికారులను నిల దీశారు. స్ట్రాంగ్ రూమ్ను తెరవాలంటే పోటీలో ఉన్న అభ్యర్థుల అందరికీ తెలియజేయాలని,కానీ ప్రధాన ప్రతిపక్ష మైన తెలుగుదేశం పార్టీకి కూడా సమా చారం ఇవ్వకుండా ఏకపక్షంగా తెరవ డం ఏంటని ప్రశ్నించారు

## ఇద్దరు బైకు దొంగలను పట్టుకున్న స్థానికులు

**పాలకొల్లు** పాలకొల్లు చెందిన ఇద్దరు యువకులు బండ్లు దొంగతనాలు చేయడానికి రా గా. గూడూరు కి చెందిన యువకులు.పట్టుకున్నారు పొంతన లేని సమాధానం చెప్పడంతో వారికి దేహశుద్ధి చేసి పోలీసులకి అప్పజెప్పారు .వీరు వెనక .గూడూరు మండలానికి చెందినపాత నేరస్తులు.బైకు దొంగలు ఉన్నారని. యువకులు చెబుతున్నారు మండలంలో దొంగతనానికి గూడూరు మండలం చెందినవారే సహకారిస్తున్నారని కూడా యువకులు అంటున్నారు దీనిపై పోలీసు వారు గట్టి చర్య తీసుకోవాలి అని మండలంలోని ప్రజలు కోరుతున్నారు

## తెలుగు జాతికి నా హృదయపూర్వక ధన్యవాదాలు

**నందమూరి రామకృష్ణ** తాజాగా జరిగిన ఏపీ ఎన్నికల గురించి నందమూరి తారక రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ ఒక వీడియో రిలీజ్ చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ అందరికీ శుభ దినం మొన్న జరిగిన ఏపీ ఎన్నికల్లో ఎన్నడు కనివిని ఎరుగని, మునుపెన్నడూ చూడని విధంగా ఓటింగ్ జరిగింది.

తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాదు పక్కనున్న రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన తెలుగు వారందరూ ఈ ఓటింగ్ లో పాల్గొనేందుకు కదలి వచ్చారు. అలా కదిలి వచ్చిన తెలుగు జాతికి, తెలుగు యువతకి, తెలుగు మహిళలకు, ఓటరు మహాశయులు అందరికీ పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే ఈ రాక్షస పరిపాలన నుంచి విముక్తి కావడానికి మన రాష్ట్ర భవిష్యత్తు కోసం, మీ భవిష్యత్తు కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం, భావితరాల భవిష్యత్తు కోసం ఎంతో కసితో మీరందరూ భారీ ఎత్తున చాలా దూరాల నుంచి తరలివచ్చారు. మీరందరూ తెలుగుదేశం కూటమి అభ్యర్థులకు భారీగా ఓట్లు వేసినందుకు కూటమి ప్రభుత్వం ఏర్పడి భారీ మెజారిటీతో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాబోతున్నారు

ఇది తథ్యం. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులకు భారీ ఎత్తున ఓట్లు వేసి గెలిపిస్తున్నందుకు యువతీ యువకులకు, ఓటర్ మహాశయులకు తెలుగు జాతి మొత్తానికి పేరుపేరునా మా తెలుగుదేశం పార్టీ తరఫున, కుటుంబం తరపున అందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తూ మీ నందమూరి రామకృష్ణ.

## వివేకా హత్య కేసు విచారణ

### – హాజరయిన కడప ఎంపిఅవినాష్ రెడ్డి

**హైదరాబాద్** మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుపై నాంపల్లిలోని సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్రెడ్డి, శివశంకర్రెడ్డి విచారణకు హాజరయ్యారు. చంచల్గూడ జైలులో ఉన్న నలుగురు నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరుపరిచారు.

### పటాన్ చెరులో మూతపడిన

## సినిమా థియేటర్లు

**పటాన్ చెరు** తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సినిమా థియేటర్లు స్వచ్ఛందంగా బంద్ చేశాయి. సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని ఆయా సినిమా థియేటర్ల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటీటీ, కార్పొరేట్ మల్టీప్లెక్స్ లు వచ్చిన తర్వాత చిన్న తరహా థియేటర్లు మూసివేసుకునే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. చిన్న తరహా థియేటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, స్వచ్ఛందంగా పది రోజుల పాటు థియేటర్లను బంద్ చేస్తున్నట్లు బోర్డులు వేశారు.

## మాదాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



**హైదరాబాద్** మాదాపూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పై పాలు అమ్ముతున్న వారిని పై కి కియా కార్నివల్ కార్ దూసుకెళ్లింది.ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో కరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో ప్రమాదం జరిగినట్లు గా కార్ డ్రైవర్ ను పోలీసులు విచారిస్తున్నారు

## హార్డ్ వేర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

**వికారాబాద్** జిల్లా కేంద్రంలోని రామయ్య కూడా రోడ్డులో నాగలక్ష్మి హార్డ్వేర్ షాప్ లో అర్ధరాత్రి మూడు గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు తెలుస్తుంది. ప్రమాదం జరిగిన సమయంలో షాపు పై భాగంలో నివసిస్తున్న కుటుంబం భయభ్రాంతులకు గురై వెంటనే ఫైరు సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. బిల్డింగ్ పైన ఉన్న వృద్ధులను పిల్లలను ఫైరు సిబ్బంది కాపాడారు వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

## జూనియర్ ఎన్టీఆర్ ఇంటి స్థలంపై వివాదం హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్** తన ఇంటి స్థలంపై వివాదం తలెత్తడంతో సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని 681 చదరపు గజాల స్థలం విషయమై సమస్య తలెత్తింది. తాను ఆ స్థలాన్ని సుంకు గీత అనే మహిళ నుంచి 2003లో కొనుగోలు చేశానని, చట్టప్రకారం అన్ని అనుమతులు పొంది అదే ఏడాది ఇంటి నిర్మాణం చేపట్టానని జూనియర్ ఎన్టీఆర్ చెబుతున్నారు. కానీ ఆ భూమిని ఎన్టీఆర్కు అమ్మిన వ్యక్తులు దానిని 1996లోనే తమ వద్ద తనాఖా పెట్టి రుణాలు పొందారంటూ ఎస్బీఐ, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, ఇండ్సఇండ్, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులు సర్ఫేసీ యాక్ట్ కింద డెట్ రకవరీ ట్రైబ్యునల్ (డీఆర్టీ)ను ఆశ్రయించాయి. విచారణ జరిపిన డీఆర్టీ.. బ్యాంకులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. బ్యాంకుల నోటీసులను సవాల్ చేస్తూ తొలుత డీఆర్టీలో ఎన్టీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న డీఆర్టీ ఆ స్థలంపై బ్యాంకులకే హక్కులుంటాయంటూ తీర్పు ఇచ్చింది.దాంతో ఎన్టీఆర్ ఫిర్యాదు మేరకు భూమి అమ్మిన గీతపై కేసు నమోదు అయింది. మరోవైపు డీఆర్టీ తీర్పుపై ఎన్టీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్పై జస్టిస్ సుజోయ్పాల్, జస్టిస్ జే.శ్రీనివా?సరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. డీఆర్టీ ఆర్డర్ కాపీ అందుబాటులో లేకపోవడంతో సమయం కావాలని జూనియర్ ఎన్టీఆర్ తరఫు న్యాయవాది కోరారు. తదుపరి విచారణను వెకేషన్ బెంచ్ ముందు పోస్టు చేయాలని విజ్ఞప్తి చేసినా అందుకు ధర్మాసనం నిరాకరించింది. విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన అన్ని వివరాల డాక్యుమెంట్లను జూన్ 3లోగా అందజేయాలని ఆదేశించింది.

### కౌంటింగ్ కేంద్రాలలో

## పకడ్బందీ భద్రతా చర్యలు

**సంగారెడ్డి** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ క్రాంతి అధికారులకు ఆదేశించారు.పటాన్ చెరు మండలం రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాల స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచిన జహీరాబాద్ ఎంపీ పరిధిలోని ఈవీఎంలకు చెందిన సెక్యూరిటీ లాక్ బుక్ రిజిస్టర్స్ లను, మూడు అంచెల సెక్యూరిటీ ఏర్పాటు ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ఐడి కార్డు లేకుండా ఎవరిని అనుమతించవద్దని అఖీఖఈ సెక్యూరిటీ అధికారుల కు ఆదేశాలు జారీ చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీ.సీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ సీల్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ , ఇఇఖఖీ సురేష్, తహసీల్దార్ రంగారావు , ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### తల్లి అనంత లోకాలకు చేరినా

## తెగని ఆస్తి పంచాయితీ

### కుమారుడు కుమార్తెల మధ్య గొడవ

**మిర్యాలగూడ** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందుల వారి గూడెం కి చెందిన వేం వెంకటరెడ్డి లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు గతంలోనే మృతి చెందారు. లక్ష్మమ్మ నేరేడుచర్ల లోని చిన్న కూతురు వద్ద ఉంటున్నారు. ఇటీవల లక్ష్మమ్మ ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డారు దీంతో ఆమెను మిర్యాలగూడలోనే ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇంటికి పంపివ్వడంతో మృతి చెందారు. మిగిలిన కూతుళ్లు ఆస్తి పంపకాలు తేలే వరకు అంబులెన్స్ ను తరలించేది లేదని తేల్చి చెప్పారు. లక్ష్మమ్మ దగ్గర ఇరవై ఒక్క లక్షల ఉన్నాయి. ఆరు లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం చిన్న కూతురుకి ఇచ్చారు. మిగిలిన 15 లక్షలు కొడుకు తీసుకున్నారు. 20 తులాల బంగారంను ముగ్గురు కూతుళ్లు పంపకాలు జరిపారు. చివరికి ఆస్తి పంపకాలు కొలిక్కి వచ్చిన అంత్యక్రియల కొరకు డబ్బులు ఇస్తేనే తలకొరివి పెడతానంటూ పట్టుబడుతున్నారు. మృతదేహం ఇంకా ఫ్రెజర్ లోనే ఉంది....

## రైతుల రాస్తారోకో

**యాదాద్రి** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ ప్రాంతంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. గత 20 రోజులకు పైగా ధాన్యం తెచ్చి మార్కెట్ లో పోస్తేచ ఇంతవరకు .. కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలతో ఇప్పటికే రెండు సార్లు ధాన్యం తడిసిపోయింది. మళ్ళీ తడిసిన ధాన్యాన్ని పది రోజులకుపైగా ఆరబెట్టినప్పటికీ.. కొనుగోలు చేయలేదని రైతులు పలుమార్లు ఆరోపిస్తున్నారు. దీంతో మోత్కూర్ – రాయిగిరి ప్రధాన రైతుల రాస్తారోకో చేపట్టడనీతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## తాడిపత్రిలో పోలీసుల సీసీ కెమెరాలు ధ్వంసం

**అనంతపురం** : ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ అనంతరం జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అనంతపురంలోని తాడిపత్రిలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. ముఖ్యంగా వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దరెడ్డి, టీడీపీ నేతలు జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య ఎప్పటి నుంచో ఉన్న వైరం ఇప్పుడు తారాస్థాయికి చేరింది. ఇందులో భాగంగా ఒకరిపై ఒకరు రాళ్లు వేసుకున్నారు.ఇది తీవ్ర రూపం దాలుస్తున్న టైంలో పోలీసులు కలుగు చేసుకొని ఇద్దర్నీ రహస్య ప్రాంతాలకు తరలించారు. కొందరు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి వెళ్లిన పోలీసులు అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్‌ను ధ్వంసం చేయడం చర్చనీయంశమైంది.జేసీ ఇంటిపైకి దాడికి యత్నించిన వ్యక్తుల్లో కీలకమైన వ్యక్తి పెద్దారెడ్డి ఇంట్లో దాక్కున్నాడని ఆయన్ని పట్టుకోవడానికే పోలీసులు ఆ ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఆ టైంలో తలుపులు, గేట్లు పగలగొట్టి ఆయన ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేశారు. ఆ ఫుటేజ్ హార్డ్ డిస్క్‌లను కూడా తమతో తీసుకెళ్లారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆరోజే చెప్పారు. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన సీసీటీవీ ఫుటేజ్ చూస్తే అదంతా నిజమని తెలుస్తోంది. అయితే పోలీసులు తీసుకెళ్లిన వీడియో ఫుటేజ్ ఇప్పుడు మీడియాకు ఎలా వచ్చిందని చర్చ నడుస్తోంది. ఇద్దరు నేతలు తాడిపత్రి నుంచి దూరంగా తీసుకెళ్లిపోయిన పోలీసులు అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

## కవితను కలిసిన బాల్కా సుమన్

**న్యూఢిల్లీ** : క్కర్ స్కామ్‌లో అరెస్టై జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ లీడర్లు ములాఖత్ అయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ పది గంటలకు తీహార్ జైలుకు వెళ్లి ఆమెతో మాట్లాడారు.

## డార్లింగ్ త్వరలో గుడ్ న్యూస్

**హైదరాబాద్** : పాన్ ఇండియా స్టార్, డార్లింగ్ ప్రభాస్ తన అభిమానులకు ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ చెప్పారు. “డార్లింగ్స్.. చివరికి ఒకరు మన జీవితంలోకి రాబోతున్నారు. కాస్త వెయిట్ చేయండి చెప్తా” అంటూ ప్రభాస్ తన అధికారిక ఇన్ స్టా ఖాతాలో స్టోరీ పోస్ట్ చేశారు. అయితే ఇది డార్లింగ్ పెళ్లి వార్తకు సంబంధించిన విషయమేనంటూ ప్రభాస్ అభిమానులు ఎగ్జైట్ అవుతున్నారు. అన్నా.. వదినెవరో చెప్పు అంటూ.. పోస్టులు పెడుతున్నారు.నాలుగు పదుల వయసు దాటినా.. మన డార్లింగ్ స్టిల్ బ్యాచిలర్ గానే ఉండిపోయారు. ప్రభాస్ ఊ కొడితే.. పెళ్లికోసం అమ్మాయిలంతా లైన్ లో నిలబడతారు. అలాంటి డార్లింగ్ పెళ్లికి ఎందుకంత దూరంగా ఉన్నారన్నదానిపై చాలా వార్తలొచ్చాయి. అందులో మెయిన్.. అనుష్కతో ప్రేమాయణమని. బిల్లా, మిర్చి, బాహుబలి, బాహుబలి –2 ఇలా వరుస సినిమాలు చేసిన వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని, పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఇంకా పెళ్లి పీటలెక్కలేదని ఒకానొక టైమ్ లో వార్తలు గుప్పుమన్నాయి. కానీ ఇద్దరిలో ఎవరూ ఆ వార్తలపై రియాక్ట్ అవ్వలేదు. బాహుబలి సమయంలో తామిద్దరం మంచి స్నేహితులమని మాత్రం చెప్పుకొచ్చారు. ఆ తర్వాత ఆదిపురుష్ లో నటించిన కృతి సనన్ తోనూ డేటింగ్ లో ఉన్నారన్న రూమర్లు వచ్చాయి.తాజాగా ప్రభాస్.. త్వరలో మన జీవితంలోకి కొత్త వ్యక్తి రాబోతున్నారని ఇన్ స్టా స్టోరీ పెట్టడంతో.. వదినమ్మ వచ్చేస్తుందంటూ అభిమానులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కొందరు వదినమ్మ అనుష్కనే అంటూ.. మీమ్స్ కూడా చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇంకొందరైతే అదేం కాదు.. మేనకోడలు పుట్టిందని కామెంట్స్ చేస్తున్నారు.మరి నిజంగానే ప్రభాస్ ఒక వ్యక్తి గురించే చెప్తారా లేక.. ఇదేమైనా సినిమా స్టంటా అన్నది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న కల్కి 2898ఆ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న కల్కి నుంచి త్వరలోనే ఫస్ట్ సింగిల్ ను విడుదల చేస్తామని చిత్రయూనిట్ నిన్ననే ప్రకటించింది. దీనితో పాటు మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ సినిమాలోనూ ప్రభాస్ నటిస్తున్నాడు. మరి ఈ రెండు చిత్రాల్లో ఏదైనా అప్డేట్ గురించి చెప్పడానికి డార్లింగ్ ఆ స్టోరీ పెట్టాడా అని కూడా సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.ఇవేవీ కాకుండా.. హీరోయిన్లు పెళ్లి చేసుకోకుండా, నవమాసాలు మోయకుండా బిడ్డల్ని కన్నట్టుగానే.. ప్రభాస్ కూడా ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోవాలని ఫిక్సై.. సరోగసి ద్వారా బిడ్డను కంటున్నాడా ? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. వీటిలో ప్రభాస్ దేని గురించి అప్డేట్ ఇస్తాడో వేచి చూడాలి. ఈ అప్డేట్ పెళ్లి గురించే అయితే.. డార్లింగ్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో మరో ట్రెండ్ ను సెట్ చేయడం ఖాయం.

## జూన్ 19 వరకు కేంద్ర బలగాలు

**విజయవాడ** : ఏపీ విషయంలో ఎలక్షన్ కమిషన్ సీరియస్ గా ఉంది. పోలింగ్ సందర్భంగా హింస చెలరేగిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ సిఎస్ జవహర్ రెడ్డి, డిజిపి హరీష్ కుమార్ గుప్తాలను ఢిల్లీకి పిలిపించిన ఈసీ సంజాయిషీ కోరినట్లు సమాచారం. ఒకానొక దశలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అల్లర్లను నియంత్రించేందుకు కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు నిఘా వర్గాల హెచ్చరికల మేరకు ఎన్నికల ఫలితాల అనంతరం.. హింస చెలరేగే అవకాశం ఉందని.. రాజకీయ దాడులకు ప్రయత్నించే ఛాన్స్ ఉందని తెలియడంతో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. జూన్ 19 వరకు కేంద్ర పోలీస్ బలగాలను ఏపీలో కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అవసరమైతే అదనపు బలగాలను పంపించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో దాడులు జరుగుతున్నాయి. తమకు ఓటు వేయలేదన్న నెపంతో ఈ దాడులు కొనసాగుతున్నాయి.గత ఐదు సంవత్సరాలుగా ఏపీలో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉండేది. అధికార పార్టీ దూకుడు మీద వ్యవహరించేది. అయితే ఇప్పుడు టిడిపి కూటమి సైతం సమ ఉజ్జీగా నిలవడం, అనుకూల ఫలితాలు వస్తాయని విశ్లేషణలు ప్రారంభం కావడం.. తదితర కారణాలతో అధికార, విపక్షం మధ్య హోరాహోరీ పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలోనే దాడులు జరుగుతున్నాయి. అయితే ముందుగా అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమైంది. దీంతో పోలింగ్ రోజే కాకుండా.. ఆ తరువాత కూడా హింస చెలరేగింది. ఈసారి పల్నాడు, మాచర్లలో తారాస్థాయికి చేరుకుంది. అనంతపురం, తిరుపతిలో కూడా రాజకీయ దాడులు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలను గృహనిర్బంధం చేశారు. అటు కేంద్ర బలగాలు వచ్చినాహింస ఆగడం లేదు. దీంతో ఈసీ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి తో పాటు డీజీపీలను ఢిల్లీ రప్పించింది. స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం.. రెండు వారాలపాటు కేంద్ర బలగాలు ఏపీలో ఉండేలా ఆదేశాలు ఇచ్చింది.

## త్రేతా యుగం గురించి తెలియని వారు ద్వాపర యుగం గురించి మాట్లాడడం విడ్డూరం

### – బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యమ్

నిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి పార్లమెంటు ఎన్నికల్లో గెలిస్తే అర్జునుడినని ఓడిపోతే అభిమన్యుడనని సంబోధించడం యావత్ హిందూ సమాజాన్ని అవమానించడమేనని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మదిపల్లి సత్యమ్ విమర్శించారు.శుక్రవారం పెగడపెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 500 సంవత్సరాల నుండి రగులుతున్న త్రేతా యుగములోని అఖిలాండకోటి బ్రహ్మండ నాయకుడు మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుని వారి చరిత్రను తప్పుబట్టి రామాయణం ఒక కల్పితం రాముడి పాత్ర కల్పితం అన్న కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న జీవన్ రెడ్డి ద్వాపర యుగంలోని అర్జునుడిని,అభిమన్యుడి పాత్రల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

దశావతారాలలో రామావతారం తర్వాతనే కృష్ణావతారం అని తెలిసిన జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు రాముని అస్తిత్వాన్ని ప్రశ్నిస్తే ఎందుకు ఖండించలేదని చేయలేదని ప్రశ్నించారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టు జీవన్ రెడ్డి మాట్లాడడం బిజెపికి, బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలియజేసిందని ఆరోపించిన జీవన్ రెడ్డి గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి, కాంగ్రెస్ పార్టీ మద్దతు చేయడం వల్లే బీజేపీ గెలిచిందని టిఆర్ఎస్ చేసిన ఆరోపణలు నిజమైతే ఇప్పుడు కాంగ్రెస్ చేసే ఆరోపణలు కూడా నిజమేనని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కూడా ఒకటేనని రుజువైందని గమనించిన ప్రజలు బిజెపికి సైలెంట్ గా ఓటేసి నిశ్శబ్ద విప్లవాన్ని చాటారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు గంగుల కొమురెల్లి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సంకిటి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పల్లె మోహన్ రెడ్డి, పెంట నరేందర్, కార్యదర్శి వరద రాము తదితరులు పాల్గొన్నారు.

# నా కొడుకును మీకు అప్పగిస్తున్నాను

సోనియా అక్కడ పర్యటించారు. రాయ్ బరేలీలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగసభలో పాల్గొన్న సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని మీ చేతుల్లో పెడుతున్నా, వాడు మిమ్మల్ని నిరాశపర్చడంటూ అక్కడి ఓటర్లకు తెలిపారు. గతంలో తనకు అండగా నిలిచినట్లే ఇకపై తన కుమారుడికి కూడా అండగా నిలవాలని సోనియా ఓటర్లను కోరారు. రాహుల్ మిమ్మల్ని ఎప్పటికీ నిరాశపర్చడంటూ సోనియా వారికి హామీ ఇచ్చారు.ఇందిరా గాంధీ, రాయ్‌బరేలీ ప్రజలు తనకు నేర్పిన పాఠాలే తాను రాహుల్, ప్రియాంకలకు నేర్పానని సోనియా గాంధీ తెలిపారు. అందరినీ గౌరవించడం, బలహీనులను రక్షించడం, ప్రజల హక్కుల కోసం అన్యాయంపై పోరాడడం వంటివి రాహుల్ కు తాను నేర్పానన్నారు. భయపడొద్దు ఎందుకంటే మీ పోరాట మూలాలు, సంప్రదాయాలు చాలా లోతైనవని రాయ్ బరేలీ ఓటర్లతో సోనియా వ్యాఖ్యానించారు. తనకు వరుస విజయాలు అందించినందుకు రాయ్ బరేలీ ఓటర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. 2004 నుంచి వరుసగా రాయ్ బరేలీలో పోటీ చేసి గెలుస్తున్న సోనియా గాంధీ అనారోగ్యం, వృద్ధాప్య కారణాలతో ఈసారి అక్కడ పోటీ నుంచి తప్పుకొని రాజ్యసభకు వెళ్లారు. తాను వదిలేసిన గాంధీల కంచుకోట రాయ్ బరేలీలో కుమారుడు రాహుల్ గాంధీని బరిలోకి దింపారు. ఇక్కట తొలుత ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని భావించినా ఇప్పటికే కుటుంబ పార్టీగా తమపై ఉన్న విమర్శలు నిజం చేయకూడదనే ఉద్దేశంతో దూరంగా ఉండిపోయారు. దీంతో గత ఎన్నికల్లో అమేథీ నుంచి ఓడిన రాహుల్ ఈసారి తన సిట్టింగ్ సీటు కేరళలోని వాయనాడ్ తో పాటు రాయ్ బరేలీలో పోటీ చేస్తున్నారు.

# టీపీసీసీ చీఫ్ పదవి ఎవరికి దక్కేనో.?

### ఎవరి లెక్కలు వారివే

పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉంది. ముఖ్యమంత్రితో కలుపుకుని రాష్ట్ర క్యాబినెట్ సంఖ్య 18 ఉండాలి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి సహా 12 మంది క్యాబినెట్లో ఉన్నారు. మిగిలిన ఆరు ఖాళీలను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే దీని మీద అధిష్టానానికి ఓ క్లారిటీ ఉందని, సామజిక వర్గాలవారీగా, జిల్లాల వారీగా ప్రాతినిధ్యం ఇచ్చే రీతిలో మిగిలిన ఆరు స్థానాలను భర్తీ చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఈ తంతు ముగియగానే పీసీసీ సారధ్య బాధ్యతలను రేవంత్ రెడ్డి నుంచి తప్పించి పూర్తిగా పాలనపై దృష్టి సారించేలా వెసులుబాటు కల్పిస్తారని చెబుతున్నారు. కొత్త పీసీసీ చీఫ్ గా సీనియర్ నేతకు అవకాశం దక్కుతుందంటున్నారు. ఈక్రమంలో ఇప్పటికే ఆయా సామాజిక వర్గాల నుంచి కీలక నేతలు తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలను కలిసినప్పుడల్లా తమ సీనియారిటీనీ, పార్టీ సేవలను, అధిష్టానం పట్ల తమ విధేయతను ప్రకటిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే పీసీసీ చీఫ్ రేసులో మంత్రి భట్టి విక్రమార్క సహా, ప్రస్తుత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే సంపత్, మధుయాష్కీ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్ వంటి నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే అధిష్టానం ఎవరికి అభయహస్తం ఇస్తుందో మాత్రం వేచి చూడాల్సిందే.

### ఎంపికకు అర్హతలేంటో.?

పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి వందకు వంద శాతం సక్సెస్ కావడంతో ఆ తర్వాత పగ్గాలు స్వీకరించే నేత కుడా ఆ మేరకు సామర్థ్యంగల వ్యక్తే ఉండాలన్నది అధిష్టానం యోచనగా పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. అంతే కాకుండా గాంధీ కుటుంబం పట్ల విధేయత తప్పనిసరి అర్హతగా కాంగ్రెస్ చరిత్ర తెలిసిన వారు ఎవరయినా చెబుతారు. అంతే కాకుండా ఏ సామాజిక వర్గానికి ఈ దఫా అవకాశం ఇస్తారా అన్నది కూడా పార్టీ లో ఉత్కంఠకు తెరలేపుతోంది. పీసీ చీఫ్ గా ఎస్సీ సామాజిక వర్గం నుండి అవకాశం ఇస్తారా లేక బీసీల నుండి అవకాశం ఇస్తారా అన్న చర్చ సాగుతోంది. లేదంటే ఓసీల నుండి అంటే రెడ్డి సామాజిక వర్గానికే మళ్లీ ఆ పీఠం దక్కుతుందా అన్న అంశంపైన పార్టీలో చర్చలు సాగుతున్నాయి. ఏది ఏమైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్ ను మరింత పటిష్టం చేసే కార్యచరణలో భాగంగానే పీసీసీ పీఠం సమర్థుడైన వ్యక్తికి దక్కుతుందని, ఇప్పటికే అన్ని రకాలుగా పార్టీ హైకమాండ్ ఈ విషయంలో తనకు కావాల్సిన సమాచారం సేకరించిందని హస్తం నేతలు చెబుతున్నారు.

### రేవంత్ రెడ్డి ఓటు ఎవరికో

అయితే సీఎం రేవంత్ రెడ్డి ఎవరికి ఓటు వేస్తారా అన్న విషయం పైన చర్చలు సాగుతున్నాయి. అటు ప్రభుత్వం %-% ఇటు పార్టీ సమన్వయంతో నడవాలంటే రేవంత్ రెడ్డికి సహకరించే వ్యక్తే పీసీసీ చీఫ్ గా ఉండవచ్చని ఈ అంశం కూడా పీసీసీ చీఫ్ ఎంపికలో ప్రధాంగా మారవచ్చన్న ఉహాగానాలు వెలువడుతున్నాయి. అటు సోనియా గాంధీ సహా, రాహుల్, ప్రియాంకలతో రేవంత్ కున్న సంబంధాల దృష్ట్యా ఈ ఎంపికలో రేవంత్ పాత్ర ప్రముఖంగా ఉండవచ్చని చెబుతున్నారు. ఏది ఏమైనా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత పీసీసీ చీఫ్ మారడం ఖాయమని స్థానిక సంస్థల ఎన్నికలకు కొత్త సారధి నేతృత్వంలోనే తెలంగాణ కాంగ్రెస్ వెళ్లనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఈ కారణంగా ఇప్పటి నుండే పార్టీ అగ్రనేతల కనుసన్నల్లో పడేందుకు ఆశావాహులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పార్టీ ముఖ్య పదవిని దక్కించుకునేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కీలక మలుపు

ఈ క్రమంలనే ఈ కేసులో ఇప్పటికే ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ఈడీ అధికారులు తాజాగా మరో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను కూడా కోర్టుకు సమర్పించారు. అయితే ఇందులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆమ్ ఆద్మీ పార్టీని కూడా నిందితుల జాబితాలో ఈడీ చేర్చింది. అయితే దేశంలోనే మొట్టమొదటిసారి ఒక పార్టీని నిందితుడిగా చేయడం తీవ్ర సంచలనంగా మారింది. ఇప్పటివరకు ఈ ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ ఇప్పటికే 7 ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేయగా ఇది ఎనిమిదవది. అయితే ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌పై ఈడీ అభియోగాలు మోపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఇప్పటివరకు 18 మందిని ఈడీ అధికారులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఇక కేజ్రీవాల్‌ను మార్చి 21 వ తేదీన ఈడీ అరెస్ట్ చేయగా 50 రోజుల తర్వాత ప్రస్తుతం ఆయన మధ్యంతర బెయిల్‌పై తీహార్ జైలు నుంచి బయటకి వచ్చారు. ఇక ఈ ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో ప్రధాన సూత్రధారి, కింగ్‌పిన్ అరవింద్ కేజ్రీవాల్ అని ఈడీ ఇప్పటికే ఆరోపించింది.ఢిల్లీలో కొత్త మద్యం పాలసీ రూపకల్పనలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కీలక పాత్ర పోషించినట్లు ఈడీ తెలిపింది. ఈ ఢిల్లీ లిక్కర్ కేసులో రకరకాల వ్యక్తుల నుంచి అందిన రూ.100 కోట్ల ముడుపులను 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ వినియోగించిందని ఈడీ ఛార్జ్‌షీట్ ఫైల్ చేసింది. ఈ క్రమంలోనే 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ ఉన్న ఓ 7 స్టార్ హోటల్ బిల్లులను కూడా ఈ కేసులో నిందితుడు చెల్లించినట్లు తమ వద్ద అన్ని సాక్ష్యాలు ఉన్నాయని ఈడీ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆమ్ ఆద్మీ పార్టీపై ఈడీ అధికారులు తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే త్వరలోనే ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కొన్ని ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక ఈ ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తన అరెస్ట్, జ్యుడిషియల్ కస్టడీని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ జరిపిన సుప్రీంకోర్టు తీర్పును శుక్రవారం రిజర్వ్ చేసింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చని కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు సూచించింది.

# ఈడీ సీజ్ చేసిన డబ్బు పేదలకు పంచుతాం

తీర్చుకుంటుందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తూనే ఉంటాయి. ఈ క్రమంలోనే ఈడీ దాఖలు చేసిన కేసుల్లో శిక్ష పడిన కేసులు చాలా తక్కువ శాతమే ఉండటం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే ఈడీ స్వాధీనం చేసుకున్న డబ్బు గురించి అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికరమైన సమాధానం చెప్పారు. అయితే ఈడీని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసి కేవలం దేశంలో ఉన్న ప్రతిపక్షాలకు చెందిన నేతలను మాత్రమే టార్గెట్ చేస్తోందని విపక్షాలు తీవ్ర ఆరోపణలు గుప్పిస్తుండగా.. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గట్టి కౌంటర్ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే కేంద్ర దర్యాప్తు సంస్థలు సమర్థవంతంగా పూర్తి స్వేచ్ఛతో పని చేస్తున్నాయని మోదీ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఈడీ, సీబీఐ లాంటి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు సోదాలు చేసి స్వాధీనం చేసుకున్న డబ్బును ఏం చేస్తారు అనే దానిపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేసిన వ్యక్తులు, సంస్థలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని, కొందరు నేతలు, పార్టీల సహకారంతో అక్రమంగా దోచుకున్న డబ్బును సీజ్ చేస్తాయని తెలిపారు. అయితే ఇలా అక్రమంగా దోచుకున్న డబ్బును దేశంలో పేద ప్రజలకు చేర్చే ఆలోచన చేస్తున్నామని నరేంద్ర మోదీ వెల్లడించారు. దాని గురించి ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం న్యాయ సలహా కోరామని వారు ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని మోదీ స్పష్టం చేశారు.

# ఇక టీఎస్ స్థానంలో టీజీ

సూచించారు. పాఠశాలలు పున:ప్రారంభమయ్యే తేదీ జూన్ 12లోగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే రోజున విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, ఒక జత స్కూల్ యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నపాటి మరమ్మతు పనులు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, త్రాగునీరు, పెయింటింగ్, ఫర్నీచర్ పనులు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

# నేడే తెలంగాణ కేబినెట్ భేటీ

ఆదేశించారు. రెండు రాష్ట్రాల సయోధ్యతో ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాలన్నారు సీఎం రేవంత్. క్లిష్టమైన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ ఉండాలని అనుకుంటున్నారు. దీనికి సంబంధించి కేబినెట్ లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రూ. 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని కోసం రూ. 34 వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని అంచనా. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్న దానిపై రేవంత్‌కు క్లారిటీ ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినేట్ లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతుంది. స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన అనంతరం ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను హడావుడిగా అమలు చేశారు. ఆ పథకాల అమలు తీరుపైనా కేబినెట్ లో చర్చించే అవకాశాలు ఉన్నాయి. లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు చర్చించనున్నారు. అలాగే నెరవేర్చాల్సిన హామీలు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళిపైనా మంత్రులతో కేబినెట్ భేటీ అనంతరం రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

# జగన్ అలా, సజ్జల ఇలా

ఏంటో వివరించారు.

### 2019 కంటే ఎక్కువ

2019 కంటే ఖచ్చితంగా ఎక్కువ సీట్లు గెలుస్తున్నామని సజ్జల చెప్పుకొచ్చారు. కుప్పం టు ఇచ్ఛాపురం ప్రతీ నియోజకవర్గంలో సంక్షేమం ఇచ్చామని గుర్తు చేసారు. తాము గతం కంటే ఎక్కువ సీట్లు గెలుస్తామనే పూర్తి విశ్వాసంతో ఉన్నామని వివరించారు. ఎన్నికల సమయంలో జగన్ ప్రచారం ప్రజల్లోకి వెళ్లిందన్నారు.చంద్రబాబు నెగటివ్ క్యాంపైన్ చేసారని..అది కూటమికి నష్టం చేసిందని పేర్కొన్నారు. ఓట్ల కోసం బస్సుల్లో వచ్చిన వారు తమకే ఓటు వేసారని సజ్జల చెప్పారు. తమ ఓటమి ఖాయమని చంద్రబాబుకు ఇప్పటికే అర్దమైందని సజ్జల వ్యాఖ్యానించారు.

### ఈసీ తప్పు సరిచేసుకోవాలి

కేంద్ర సహాయంతో కొందరుఅధికారులను తప్పించారని సజ్జల ఆరోపించారు. కేతిరెడ్డి ఇంట్లో సీసీటీవీలను పోలీసులు ధ్వంసం చేయటం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఇప్పటికైనా తప్పు సరిదిద్దుకోవాలని సూచించారు. పోలీసుల అబ్జర్వర్ దీపక్ మిశ్రాను తప్పించాలని డిమాండ్ చేసారు. కౌంటింగ్ లో అక్రమాలు జరుగుతాయని అనుకోవటం లేదని.. కౌంటింగ్ లోఅక్రమాలు జరిగితే ఎదుర్కొంటాం అని సజ్జల స్పష్టంచేసారు. అక్కడక్కడా స్థానికంగా సమస్యలు ఉన్న నియోజకవర్గాలు మినహా అన్నింటా గెలుస్తామన్నారు. కుప్పంలోనూ వైసీపీ గెలుస్తుందని సజ్జల ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు.

# పోలింగ్ అనంతరం హింసపై కఠిన చర్యలు

రోజుల్లో కీలక చర్యలు తీసుకుని నివేదికను ఈసీకి సమర్పించే అవకాశం ఉంది. పోలింగ్ రోజు మధ్యాహ్నం ప్రారంభమైన హింస నాలుగు రోజుల పాటు కొనసాగింది. మాచర్ల, నరసరావుపేట, పల్నాడు, చంద్రగిరి, తాడిపత్రి, తిరుపతిల్లో జరిగిన ఘటనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ అల్లర్ల కేసులన్నింటినీ సిట్ పూర్తి స్థాయిలో విచారించనున్నది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్ లను కూడా సిట్ పరిశీలించి అదనపు సెక్షన్లు చేర్చనుంది. ఘర్షణలకు సంబంధించి కుట్రలో పాలు పంచుకున్న కొంత మంది సీనియర్ రాజకీయ నేతల్ని కూడా అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇలా చేస్తారన్న సమాచారం ఉండటంతో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఘర్షణల్లో నేరుగా పాల్గొని దాడులు చేసిన ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లారు. వాస్తవానికి వీరిని హౌస్ అరెస్టులో ఉంచారు. అయినా వీరు అజ్ఞాతంలోకి వెళ్లడంతో పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి.మరో వైపు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికలు జరిగిన తరువాత చెలరేగిన హింసాత్మక సంఘటనలపై ప్రాథమిక విచారణ పూర్తి చేసి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదికను పంపినట్లు తెలుసతోంది. నరసరావుపేట, పల్నాడు, చంద్రగిరి, మాచర్, తాడిపత్రి, తిరుపతిలో చోటు చేసుకున్న సంఘటనలపై రాష్ట్ర ఈసీ ఆఫీస్, కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదికను పంపినట్లు తెలుస్తోంది. ఉద్దేశపూర్వకంగా చేసిన ఘర్షణలు ఈసీ వైఫల్యం అనేలా చేస్తున్న ఆరోపణలను కూడా నివేదికలో పేర్కొన్నట్లుగా చెబుతున్నారు. మరో వైపు పలు ఘటనల్లో పోలీస్ ఉన్నతాధికారుల వైఫల్యం కనిపించడంతో ఇద్దరు ఎస్పీ స్థాయి అధికారుల్ని సస్పెండ్ చేశారు. మరికొంత మందిని బదిలీ చేశారు. పలువురు దిగువస్థాయి పోలీసు అధికారుల్ని సస్పెండ్ చేశారు. ఇప్పటికే కౌంటింగ్ అనంతర హింస ఎక్కువగా ఉంటుందని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేయడంతో పెద్ద ఎత్తున బలగాలను ఏపీకి తరలిస్తున్నారు.

# అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

కారణాలను సమావేశంలో చర్చించారు.హైదరాబాద్ నుంచి విజయవాడ రహదారిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. హైవేలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న 17 బ్లాక్ స్పాట్ ప్రాంతాలను అధికారులు వివరించారు. చౌటుప్పల్, పెదకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, జనగామ క్రాస్ రోడ్స్, ఈనాడు జంక్షన్, దురాజ్ పల్లి జంక్షన్, ముకుందాపురం, అకుపాముల, కోమరబండ క్రాస్ రోడ్స్, కటకం గూడెం, మేళ్ల చెరువు, శ్రీరంగాపురం, రామాపురం క్రాస్ రోడ్స్, నవాబ్పేట జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. బ్లాక్ స్పాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించిన సందర్భంగా.. సైన్ బోర్డులు, వేగ నియంత్రణ వంటి చర్యలను వెంటనే చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. రహదారిపై కొన్నిచోట్ల ఆరులేన్ల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, అండర్ పాస్లు, సర్వీసు రోడ్ల నిర్మాణం వంటి ప్రణాళికలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రహదారులను యాక్సిడెంట్ ఫ్రీ గా మారుస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులను కూడా త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులకు దిశానిర్ధేశం చేయడం జరిగిందన్నారు. ఆర్ఆర్ఆర్ రాష్ట్ర భవిష్యత్తును మార్చే సూపర్ గేమ్ ఛేంజర్ అని మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రీజినల్ రింగ్ రోడ్ ను త్వరితగతిన పూర్తిచేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# కేఏ పాల్‌పై చీటింగ్ కేసు

ఆ తర్వాత తెలంగాణపై దృష్టి పెట్టలేదు. ఇటీవలి ఎన్నికల్లో వరంగల్ నుంచి బాబూమోహన్ పోటీ చేస్తారని ఆయన ప్రకటించినప్పటికీ.. చివరికి బాబూమోహన్ కూడా హ్యాండిచ్చారు.కేఏ పాల్ తన పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల కోసం వెదుక్కుంటూ ఉంటారు. ఆయన పార్టీకి డబ్బులు ఇచ్చి మరీ టిక్కెట్ తీసుకునే వాళ్లు ఉంటారా అని ఈ కేసు గురించి తెలిసిన వాళ్లు ఆశ్చర్యపోతున్నారు. అది కూడా యాభై లక్షల మొత్తం కావడంతో పోలీసులు కూడా పాల్ పార్టీ తరపున పోటీ చేయడానికి ఇంత మొత్తం ఇస్తారా అని ఆరా తీస్తున్నారు. కేఏ పాల్ స్వయంగా పోటీ చేసినా రెండు, మూడు వేల ఓట్లు రావడం కష్టం. మునుగోడులో కేఏ పాల్ పోటీ చేస్తే మూడు వేల ఓట్లు వచ్చాయి. ఆయన పార్టీ తరపున నిలబెట్టడానికి అభ్యర్థులు కూడా లేరు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలంగాణలో ఎంపీ స్థానాల్లో కూడా అభ్యర్థుల్ని నిలబెట్టలేకపోయారు. ఏపీలో కూడా తాను ఒక్కరే నిలబడ్డారు. పలువురుకి బీఫాంలు ఇచ్చినప్పటికీ వారెవరో ఎవరికీ తెలియదు. కనీసం ప్రచారం చేసే వారు కూడా లేరు. కేఏ పాల్ విశాఖపట్నం ఎంపీగా పోటీ చేశారు. తనకు పది లక్షల ఓట్లు పడ్డాయని తానే గెలవబోతున్నట్టు పాల్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తాను గెలవబోతున్నట్టు ఇంటెలిజెన్సీ వాళ్లు కూడా తనతో చెప్పారని ఆయన అంటున్నారు. కేఏ పాల్ పై కేసు వెనుక దురుద్దేశం ఉందని ఆయన పార్టీ టిక్కెట్లకు డబ్బులు ఇచ్చే వారు ఉండరని పాల్ సానుభూతి పరులు చెబుతున్నారు. ఈ కేసుపై ప్రస్తుతం విశాఖలో ఉన్న కేఏ పాల్ స్పందించాల్సి ఉంది.

# వీసా దారులకు గుడ్ న్యూస్

**హైదరాబాద్ :** జూలో ఉద్యోగం కోల్పోయిన ఈ-1ః వీసా హోల్డర్ల కోసం ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అమెరికా తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. గూగుల్, టెస్లా, వాల్‌మార్ట్ వంటి ప్రధాన అమెరికన్ సంస్థలు ఇటీవల లేఆఫ్స్ ప్రకటించాయి. దీంతో చాలా మంది కార్మికులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. ఈ ప్రభావం యూఎస్‌లో సెటిల్ అయిన ఇండియన్ టెక్ కార్మికులపై కూడా పడింది.అయితే, జూఅమెా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. జూలో తమ బసను పొడిగించుకునే అవకాశం కల్పించింది. ఉద్యోగం కోల్పోయిన ఈ-1ః వీసా దారులకు 60-రోజుల గ్రేస్ పీరియడ్ కల్పించింది. అయితే జూఅమెా గ్రేస్ పీరియడ్ ముగిసిన తర్వాత ఏమి చేయాలనే ప్రక్రియను వివరించింది.-వలసేతర స్థితి మార్పు కోసం దరఖాస్తును ఫైల్ చేసుకోవచ్చు. స్థితి సర్దుబాటు కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు.-'బలవంతంగా పరిస్థితుల' ఉపాధి అధికార పత్రం కోసం దరఖాస్తును చేయవచ్చు.-యజమానిని మార్చడానికి పిటిషన్ వేసుకోవచ్చు. కొత్త యజమాని కోసం పని చేస్తున్నట్లయితే.. ఈ-1ః వలసేతర వ్యక్తులు అనుసరించాల్సిన నియమాలను కూడా జూఅమెా వివరించింది. వీసా-హోల్డర్ ఉద్యోగాలను మార్చాలనుకుంటే.. వారి కొత్త యజమాని తప్పనిసరిగా ఫారమ్ ఎ-129ని నింపి సంబంధిత అధికారులకు పంపాలి. వ్యక్తి సమర్పించిన వెంటనే వారి కొత్త యజమాని కోసం పని చేయడం ప్రారంభించవచ్చు. ఉద్యోగాలను మార్చడానికి ముందు ఆమోదం కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు.ఫారమ్ ఎ-485ని సమర్పించడం ద్వారా శాశ్వత నివాసి (గ్రీన్ కార్డ్ హోల్డర్) అయ్యేందుకు దరఖాస్తు చేసి, కనీసం 180 రోజులు ఆమోదం కోసం వేచి ఉంటే, వారు అంతర్లీన పిటిషన్‌ను (ఫారమ్ ఎ-140) కొత్త ఉద్యోగ ఆఫర్‌కి తరలించవచ్చు ఒకే యజమానితో లేదా వేరే వారితో ఒకే రకమైన పని చేసుకోవచ్చని జూఅమెా తెలిపింది.యజమాని స్పాన్సర్‌షిప్ అవసరం లేకుండా వలస వీసాల కోసం దరఖాస్తు చేసుకోగల కార్మికులు తమ స్థితిని సర్దుబాటు చేసుకోవాలనుకునే సమయంలోనే వారి వీసాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వారి స్థితి సర్దుబాటు కోసం ఎదురు చూస్తున్నప్పుడు, వారు జూలో ఉండి, ఉపాధి అధికార పత్రాన్ని (ఇంఅ) పొందవచ్చు. వారు పెద్ద ఇబ్బందులను ఎదుర్కొంటున్న సందర్భాల్లో ఉపాధి ఆధారంగా వలస వీసా పిటిషన్‌ను మంజూరు చేసినట్లయితే.. వారు ఏడాది ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఇంఅ)కి అర్హత పొందవచ్చు.

# కోనరావుపేటలో రైతుల అందోళన

**సిరిసిల్ల** రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధాన్యం బస్తాలు రోడ్డుపై వేసి రైతులు బైఠాయించాలి. 45 రోజులుగా కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేసారు.

# తంగళ్ళపల్లి మండలంలో పిడుగుపాటుతో ఒకరు మృతి



**సిరిసిల్ల** సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్, సంజీవయ్య నగర్ ప్రాంతం గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికి జలమయమయ్యాయి. సుమారు అరగంటసేపు కురిసిన వర్షానికే సంజీవయ్య నగర్ కమాన్ ప్రాంతంలో వాహనాలు నీట మునిగిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల ప్రాంతం కావడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు వారి బంధువులు వరదనీటిలో నడవలేక అసహనానికి గురవుతున్నారు. పాత బస్టాండు ప్రాంతం కూడా వర్షపు నీటితో కొద్దిసేపు జలమయమైంది. బస్టాండ్ ఎదురుగా ఉన్న రుచి హోటల్ ముందు భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తంగళ్ళపల్లి మండలంలో పిడుగుపాటుతో ఒకరు మృతి చెందారు. **-ప్రతిసారి ఇదే పరిస్థితి** వర్షం పడ్డ ప్రతిసారి సిరిసిల్లలోని పాత బస్టాండ్, సంజీవయ్య నగర్ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకాస్త భారీ వర్షం అయితే పట్టణంలోని వెంకంపేట, ప్రగతి నగర్ వాసుల ఇళ్లలోకి వరద నీరు ముంచేత్తుతోంది.మున్సిపల్ అధికారులు ప్రణాళిక లోపంతో ఇష్టారాజ్యంగా నిర్మించిన మురికి కాలువలు,రోడ్ల వల్ల ఈ పరిస్థితి దాపురించింది. గతంలో ఎంతో భారీ వర్షం పడితే కానీ ముంపు మాట వినని సిరిసిల్ల ప్రాంతం ఇప్పుడు చిన్నవర్షానికి గజగజలాడిపోతోంది. ముంపు ప్రభావిత ప్రాంతాలైన సంజీవయ్య నగర్, ప్రగతి నగర్, అశోక్ నగర్,వెంకంపేట, పాత బస్టాండ్ ఏరియా,శ్రీనగర్ కాలనీలో అయితే వర్షం పడితే చాలు వరద ముంచుకొస్తుందేమోనన్నఆందోళనలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా సిరిసిల్లలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.వరదలు అడ్డుకునేందుకు మునిసిపల్ శాఖ చేపట్టిన పనులు ఏమి సత్ఫలితాలను ఇవ్వడం లేదు.

# ఖమ్మం టౌన్‌లో రాకేష్ రెడ్డి ప్రచారం

**ఖమ్మం** ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనుముల రాకేష్ రెడ్డి ఖమ్మంలో ప్రచారం చేసారు. ఎస్సార్ అండ్ బీజీఎన్నార్ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో జిల్లా అధ్యక్షులు తాతా మధు తో కలిసి వాకర్స్ ను ఓటు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదట ప్రాధాన్యత ఓటు 3వ నెంబర్ పై వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను అనగ తొక్కుతుందన్నారు. సమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ జె సి కృష్ణ, కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నయీమ్ సేవలు అభినందనీయం

## - జనసేన నాయకులు పేటేటి చంద్రనీల్



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ నయీమ్ సేవలు అభినందనీయమని జనసేన పార్టీ నాయకులు పేటేటి చంద్రనీల్ అన్నారు. గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్డు అల్ ఇస్లాం పవర్ టూల్స్ షాపు వద్ద శుక్రవారం జనసేన నాయకుడు, చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ నయీమ్ 60 మంది పేరుపేదలకు బిరియానీ ప్యాకెట్లు పేటేటి చంద్రనీల్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, దివ్యాంగులు, వృద్ధులకు ఒక్కపూటనైనా భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో గత పదేళ్లుగా ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా భోజన ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నయీమ్ నిర్వహించడం గొప్పవిషయమన్నారు. నయీమ్ ను యువత స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. అల్ ఇస్లాం పవర్ టూల్స్ నిర్వాహకులు, చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ నయీమ్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి వ్యాపారంలో వచ్చే లాభంలో కొంత భాగాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. శక్తి ఉన్నంతవరకూ ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అల్ ఇస్లాం పవర్ టూల్స్ షాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో తారల తళుక్కులు



## - క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్న ఐశ్వర్య..ఊర్వశి రౌతాల

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ప్రస్తుతం 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. కేన్స్ ఫిలం ఫిస్టివల్‌లో మన తారలు తళుక్కుమన్నారు. ఇద్దరు తారలు తమ అందాల ఆరబోతతో ఆకట్టుకున్నారు. ఇందులో మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తళుక్కుమన్నది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆ బ్యూటీ క్యాట్‌వాక్ చేసింది. మెగాలోపోలిస్ ఫిల్మ్ కోసం ఆమె రెడ్ కార్పెట్‌పై జిగేల్మన్నది. ఫాల్గుణి అండ్ షేన్ పీకాక్ డిజైనర్లు రూపొందించిన బ్లాక్ గౌన్‌లో ఐశ్వర్య దర్శనమిచ్చింది. గత రెండు దశాబ్దాల నుంచి కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య.. ఫిల్మ్ లవర్స్‌ను థ్రిల్ చేస్తూనే ఉన్నది. త్రీడీ మెటాలిక్ ఎలి మెంట్స్ ఉన్న మోనోక్రోమ్ గౌన్‌లో ఐశ్వర్య కనిపించారు. అయితే ఐశ్వర్య కుడి చేతికి ఇటీవల గాయమైంది. అ యితే ఏ కారణం చేత ఆమెకు గాయ మైందో తెలియదు. కానీ చేతి కట్టు తోనే ఆమె క్యాట్‌వాక్‌లో పాల్గొన్నది. ఐశ్వర్య కూతురు ఆరాధ్య కూడా ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనిపించింది. కియారా అద్వానీ, సోభితా దూళిపాళ, ఆదితి రావు హైదరీతో పాటు ఇతర బాలీవుడ్ నటీనటులు కేన్స్‌లో దర్శన మిచ్చారు. 77వ కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య క్యాట 'వాక్‌లో పాల్గొనడం ఇది 21వసారి. ఐశ్వర్య రాయ్ బచ్చన్ రెడ్ కార్పెట్‌పై క్యాట్ వాక్‌తో ఆకట్టుకోగా.. తాజాగా మరో నటి ఊర్వశి రౌతేలా సైతం సందడి చేసింది. కస్టమ్ మేడ్ గౌనులో హొళయలు పోతూ అందరినీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఊర్వశి ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యతో కలిసి పాల్గొనింది. కియారా అద్వానీ, సోభితా దూళిపాళ, ఆదితి రావు హైదరీతో పాటు ఇతర బాలీవుడ్ నటీనటులు కేన్స్‌లో ర్శనమివ్వనున్నారు.

# రాజమౌళి, మహేశ్‌బాబుల కాంబో

## - క్రేజీ ప్రాజెక్ట్‌పై ర్యూమర్స్..నమ్మవద్దన్న సంస్థ




స్టార్ డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఓ సినిమాలో నటించనున్న విషయం తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందా అని సినీ ప్రియులంతా ఎదురు చూస్తున్నారు. దీనికి సంబంధించిన చిన్న విషయం బయటకు వచ్చినా అది క్షణాల్లో వైరల్‌గా మారుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ కాస్టింగ్ గురించి ఓ వార్త సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుంది. దీనిపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇస్తూ నోట్ రిలీజ్ చేసింది. 'రాజమౌళి-మహేశ్‌బాబు ప్రాజెక్ట్‌కు సంబంధించిన నటీనటుల ఎంపికపై రకరకాల వార్తలు వస్తున్నాయి. కొన్ని ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో వెలువడిన కథనాలు మా దృష్టికి వచ్చాయి. కాస్టింగ్ డైరెక్టర్ వీరేన్ స్వామి సినిమాలో భాగమైనట్లు రాశారు. అందులో నిజం లేదు. ఈ మూవీకి సంబంధించి ఏ అప్‌డేట్ అయినా మేమే ఇస్తాం. ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చే అధికారిక ప్రకటనను తప్ప మరే ఇతర అప్‌డేట్‌లను నమ్మొద్దు' అని శ్రీ దుర్గ ఆర్ట్స్ పేర్కొంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌కు 'మహారాజ్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇందులో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్‌గా, హాలీవుడ్ ప్రముఖ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలకపాత్ర పోషించనున్నారని కూడా జోరుగా ప్రచారమవుతోంది. మరోవైపు మహేశ్‌బాబు కూడా ఈ సినిమా కోసం సిద్ధమవుతున్నారు. తన లుక్‌ను కూడా మార్చుకున్నారు.

# ప్రశాంత్ నీల్

## - ఎన్టీఆర్ కాంబినేషన్ మూవీ

## - చిత్రానికి డ్రాగన్ పేరు పెట్టినట్లు వైరల్



ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి చాలా నెలలు అవుతోంది. అప్పటి నుంచి దీనిపై ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ఫ్యాన్స్ మూవీ టీమ్‌ను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. 'ఎన్టీఆర్31'వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' పేరు ఖరారు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పేరుతో కొన్ని పోస్టర్లు ఎక్స్‌లో దర్శనమిస్తున్నాయి. అక్టోబర్‌లో ఈ భారీ బ్జడెట్ మూవీ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని కూడా రెండు భాగాలుగా తెరకెక్కించాలని భావిస్తున్నారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ప్రస్తుతం అటు ప్రశాంత్ నీల్ , ఇటు ఎన్టీఆర్ ఇద్దరూ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ 'సలార్2' పనుల్లో మునిగిపోయారు. ఎన్టీఆర్ 'దేవర' షూటింగ్‌లో ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ డ్రామా ఇది. సముద్ర తీర ప్రాంతం నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందుతోంది. ఈ మూవీతోనే బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ (ఏజీనిరలతి ఐజూనీనీస) టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడు. తొలి భాగం అక్టోబరు 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనితో పాటు 'వార్2'లోనూ ఎన్టీఆర్ నటిస్తున్నారు. ఈసినిమాతో ఆయన బాలీవుడ్‌లోనూ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

# ప్రభాస్ పోస్ట్‌పై అభిమానుల తర్జనభర్జలు



## - ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరంటూ నెటిజన్ల ఆసక్తి

టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్ పెట్టిన ఇన్‌స్టా పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. చాలా అరుదుగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయన ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దీంతో అది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. 'డార్లింగ్స్.. ఎట్టకేలకు మన జీవితంలోకీ ఓ ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు. వెయిట్ చేయండి' అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో చెప్పిన ప్రత్యేక వ్యక్తి ఎవరంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఫ్యాన్స్ ఎక్స్‌లో షేర్ చేస్తున్నారు. ఆయన నటిస్తోన్న 'కల్కి' సినిమాలో కమల్ హాసన్ లుక్ రిలీజ్ చేయనున్నట్లు టాక్. ఈ సినిమా ప్రమోషన్స్ కోసమే ఈ పోస్ట్ పెట్టినట్లు సమాచారం. తనకు కమల్ హాసన్ అంటే ఎంత ఇష్టమో ప్రభాస్ ఇప్పటికీ చాలా సార్లు చెప్పారు. ఆయన ఈ సినిమాలో భాగమైనట్లు వెల్లడించినప్పుడు కూడా ఆనందంతో పోస్ట్ పెట్టారు.. 'నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయే క్షణం. కమల్ హాసన్ లాంటి లెజెండరీ నటుడితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు. ఇప్పుడు కూడా ఆయన కోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టినట్లు అర్థమవుతోంది. మరికొందరు మాత్రం ఆయన పెళ్లి గురించి పెట్టారని చర్చించు కుంటున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రానున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లరే 'కల్కి 2898 ఏడీ. ఇందులో కమల్‌హాసన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపిక పదుకొణె నటిస్తుండగా పశుపతి, దిశాపటానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ మూవీ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# గేమ్ ఛేంజర్ తరవాతే బుచ్చిబాబుతో సినిమా

గ్లోబల్‌స్టార్ రాంచరణ్ హీరోగా, అగ్ర దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' షూటింగ్ మొదలై చాలా కాలం అయినా ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఇటీవల తాజా షెడ్యూల్ మొదలు పెట్టారు. అక్టోబర్‌లో విడుదల చేయాలన్న తాపత్రయంతో శరవేగంగా చిత్రీకరణ చేస్తున్నారు. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్ 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రం చేయబోతున్నారు. ఇటీవల గ్రాండ్‌గా ఈ చిత్రం పూజా రెగ్యులర్ షూటింగ్ ఇంకా మొదలు కాలేదు. దర్శకుడు బుచ్చిబాబు అయితే షూటింగ్ ఎప్పుడు మొదలుపెడదామా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. అయితే 'గేమ్ చేంజర్' షూటింగ్ పూర్తి కాకుండా రాంచరణ్ ఈ సినిమా షూటింగ్ పాల్గొనకూడదని ఫిక్స్ అయ్యారట. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. 'ఆర్‌సీ 16' షూటింగ్‌ను జూనలో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇందులో కథానాయికగా జాన్వీ కపూర్ ఎంపికయ్యారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. గేమ్ ఛేంజర్ చిత్రాన్ని అక్టోబర్ 10 న విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం.



# లగ్గం మూవీ డబ్బింగ్ పార్ట్



టాలీవుడ్ యువ నటులు సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటిస్తున్న చిత్రం 'లగ్గం'. పెళ్లి నేపథ్యంలో తెలుగు సంప్రదాయాలను కళ్లకు కడుతూ తెరకెక్కెతున్న ఈ సినిమాకు రమేశ్ చెప్పాల దర్శకత్వం వహిస్తుండగా.. నటకిరిటి రాజేంద్రప్రసాద్ చాలా రోజుల తర్వాత కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే తాజాగా ఈ మూవీ డబ్బింగ్ పనులు మొదలుపెట్టినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. రాజేంద్రప్రసాద్ తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్న ఫొటోను ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సినిమాపై దర్శకుడు మాట్లాడుతూ.. పెళ్లి తాలూకు ఆటపాటలు, మర్యాదలు, భావోద్వేగాలతో సాగుతుంది. తెలంగాణ నేపథ్యంలో చక్కటి ప్రేమకథగా అలరిస్తుంది' అన్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాలో రోహిణి, సప్తగిరి, ఎల్బీ శ్రీరామ్, రఘుబాబు ముఖ్య పాత్రలు పోషిస్తుండగా.. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాల్‌రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: రమేష్ చెప్పాల.

# బీఆర్ఎస్‌కు పెను సవాల్‌గా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

## - అభ్యర్థి ఎంపికలోనే తడబడ్డారా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత రాష్ట్ర సమితికి ఒకటి తర్వాత ఒకటి అనేక సమస్యలు వచ్చి పడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత లోక్ సభ ఎన్నికల్లో కనీసం ఓటు బ్యాంక్ ను నిలుపుకోవాల్సిన సవాల్ ఎదురైంది. అంతకు మందే తమ సిట్టింగ్ స్థానం అయిన మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. భారీ మెజార్టీ ఉన్న బీఆర్ఎస్ ఆ సీటును నిలబెట్టుకుంటుందో లేదో చెప్పడం కష్టమన్నట్లుగా మారింది. చివరికి కౌంటింగ్ వాయిదా పడింది. లోక్ సభ ఎన్నికల కారణంగా జూన్ రెండో తేదీ తర్వాత కౌంటింగ్ చేయనున్నారు. ఈ రెండు ఫలితాల టెన్షన్ తో పాటు తాజాగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కూడా వచ్చి పడింది. ఖమ్మం, నల్గొండ, వరంగల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### - పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో వచ్చిన ఉపఎన్నిక

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాలుగు నెలలకే లోక్ సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలతో కిందా మీదా పడుతున్న సమయంలోనే మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రభావం చూపేలా మరో ఉపఎన్నిక వచ్చి పడింది. అదే ఖమ్మం, నల్గొండ, వరంగల్, పట్టభద్రుల ఉపఎన్నిక. మూడేళ్ల క్రితం ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ స్థానం నుంచి గెలిచారు. ఆయన జనగామ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దాంతో రాజీనామా తప్పనిసరి అయింది. ఉపఎన్నిక వచ్చేసింది. కానీ వలస నేతకు టిక్కెట్ ఇచ్చి బీఆర్ఎస్ మొదటి అడుగులోనే తడబడింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీల బలం పరిమితంగా ఉంటుంది. విద్యావంతులు ఎవరికి నచ్చితే వారికి ఓటు వేస్తారు. గతంలో విద్యా సంస్థల అధినేత ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా అంగ, అర్థబలాలను ఉపయోగించుకుని విజయం సాధించారు.

### కాంగ్రెస్ తరపున దూసుకెళ్తున్న తీన్మార్ మల్లన్న

రెండో స్థానంలో తీన్మార్ మల్లన్న, మూడో స్థానంలో కోదండరాం నిలిచారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి రేసులో కూడా లేరు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ అధికార పార్టీ హెూదాలో ఉండటంతో ముందస్తుగానే అభ్యర్థిని ప్రకటించింది. గ్రాడ్యుయేట్లలో మంచి ఆదరణ ఉన్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ ను ఎంపిక చేసుకుంది. ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. ఇక బీఆర్ఎస్ కు ఓ రకంగా ఇది సిట్టింగ్ స్థానం. తమ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామా వల్ల వచ్చిన ఉపఎన్నిక. అందుకే గెలవడం మరింత ప్రతిష్టాత్మకం. కానీ ఇప్పుడు అభ్యర్థిని నిలపడంతోనే తడబడ్డారు. మరో వైపు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రత్యేక శైలితో ప్రచారం చేసుకుంటున్నారు ఆయనకు కాంగ్రెస్ నేతలు సహకరిస్తున్నారు. సాధారణ రాజకీయ నేతలతో పోలిస్తే ఆయనది భిన్నమైన శైలి.



నామినేషన్ వేయగానే తనతో పాటు తన కుటుంబానికి ఉన్న ఆస్తులన్నింటినీ ప్రభుత్వానికి రాసిచ్చేశారు. తీన్మార్ మల్లన్న పబ్లిసిటీ స్టంట్ చేశారని అనుకున్నారు. కానీ ఆయన పత్రాలు రిజిస్టర్ కూడా చేసేశారు. పనితీరు ఆధారంగా తనపై తానే రీకాల్ సిస్టమ్ కూడా పెట్టుకుంటానని చెబుతున్నారు. కేసీయార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యూట్యూబ్ ఛానల్లో చేసిన వీడియోలతో తీన్మార్ మల్లన్న పాపులర్ అయ్యారు. క్యూ న్యూస్ పేరుతో ఉన్న ఆయన చానల్ కు యువతలో మంచి క్రేజ్ ఉంది. ఓ టీవీ చానల్లో 'తీన్మార్ మల్లన్న' కార్యక్రమంతో చింతపండు నవీన్ కుమార్ కు తీన్మార్ మల్లన్న అన్న పేరు స్థిరపడిపోయింది. దాన్ని ఆయన క్రమబద్ధంగా ఉపయోగించుకుంటూ వస్తున్నారు.

### బీఆర్ఎస్ అభ్యర్థికి దొరకని సొంత పార్టీ నేతల మద్దతు

బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేష్ రెడ్డిని కేసీఆర్ ఖరారు చేశారు. బీజేపీ టిక్కెట్ రాకపోవడంతో ఆయన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ లో చేరారు. రాకేశ్ రెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి సహా మెజార్టీ లీడర్లు వ్యతిరేకిస్తున్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నిర్వహించిన సమావేశానికి సగానిపైగా లీడర్లు హాజరు కాలేదు. 130 మంది నాయకులకు ఆహ్వానం ఉండగా కేవలం 50 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ టికెట్ ను వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, గీత కార్మికుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, దూదిమెట్ల బాల్ రాజ్ యాదవ్ ఆశించారు. వారెవరూ సహకరించే పరిస్థితి లేదు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలోని మఖ్యనేతలే మీటింగ్ కు రాలేదు. ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్ల ధర్మారెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వారాజు సారయ్య, తక్కెళ్లపల్లి రవీంద్ రావుతో పాటు పలువురు కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఈ మీటింగ్ కు గైర్హాజరయ్యారు. రాకేశ్ రెడ్డికి మద్దతు ఇచ్చేది లేదని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు.

### బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు - తేడా వస్తే కష్టమే

ఈ స్థానానికి 2021లో ఎన్నికలు జరిగినప్పుడు మల్లన్న ఇండిపెండెంట్ గా పోటీ చేశారు. కోదండరాంను కూడా దాటేసి రెండో స్థానంలో నిలిచారు. 2021లో జరిగిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉంది.

పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యా సంస్థల అధినేత. ఆయన తన నెట్ వర్క్‌ను ఉపయోగించుకుని పట్టభద్రుల ఓట్లను పెద్ద ఎత్తున ఎన్‌రోల్ చేయించారు. పకడ్బందీగా పోల్ చేయించుకోగలిగారు. కానీ ఈ సారి ఓట్ల నమోదులోనూ పార్టీలు పెద్దగా జోక్యం చేసుకోలేదు. దీనికి కారణం సాధారణ ఎన్నికల హడావుడిలో పడిపోవడమే. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రోత్సాహకరమైన ఫలితాలు వస్తాయని బీఆర్ఎస్ నేతలు ఆశలు పెట్టుకోవడం లేదు. అయితే దెబ్బ మీద దెబ్బ అన్నట్లుగా సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ ఓడిపోతే క్యాడర్ నైతిక స్థైర్యం మరింతగా దిగజారిపోతుంది. అందుకే బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ గట్టి ప్రభావం చూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కమీషనర్ సాబ్ మమ్మల్ని కాపాడండి

- షెడ్డు లోని పరిశ్రమ నుండి వెదజల్లుతున్న దుర్వాసనతో అనేక ఇబ్బందులు
- నూనె వాసనకు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి
- చర్యలు తీసుకోవాలని కోరిన తండావాసులు



**కొత్తూరు (ప్రశ్న న్యూస్)** మండల పరిధిలోని కొత్తూరు తండా సర్వే నెంబరు 52 %ఒ% 72లో గల షెడ్డులో నుండి వెలుగోడుతున్న దుర్వాసనకు తమకు ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉందని. తమ నివాసాలలో ఉండలేకపోతున్నామని, షెడ్డు పక్కనే ఉన్నటువంటి తమ వ్యవసాయ కులాలలో ఉండే మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయని. ఈ దుర్వాసన నుండి తమని కాపాడాలని తండావాసులు మున్సిపల్ కమిషనర్ కు మొరపెట్టుకున్నారు. దుర్వాసన వెదజల్లుతున్న పరిశ్రమ ను వెంటనే మూసివేయాలని కోరారు. జనావాసంలో ఉన్నటువంటి కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను మూసివేయాలని కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, మున్సిపల్ కమిషనర్ కు మొరపెట్టుకున్నారు.

## ప్రజలు లబ్దిపొందేలా రియల్ ప్రోత్సాహకాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** ప్రతి పౌరుడు లబ్ది పొందేలా తమ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఉంటాయని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. నిర్మాణ రంగంలో హరిత భవనాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నగరంలోని హైటెక్స్‌లో గ్రీన్ బిల్డింగ్ ప్రాపర్టీ షోను మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. 40 శాతం విద్యుత్‌ను నిర్మాణరంగం వినియోగిస్తోంది. కర్బన ఉద్గారాలు సైతం వెలువడుతున్నాయి. హరిత భవనాల గురించి కొనుగోలు దారులకు నిర్మాణ సంస్థలు అవగాహన కల్పించాలి. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి నిర్మాణం ప్రారంభమైంది. ప్లాస్టిక్ వినియోగంపై కేంద్రంలోని అప్పటి మన్మోహన్‌సింగ్ సర్కారు కఠిన చట్టాలను తీసుకొచ్చింది. గతంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ఆకస్మిక తనిఖీలు చేశాను. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మా ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఐటీ రంగంలో రూ.వేలకోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగాలతో పాటు పరోక్షంగా ఎన్నో అవకాశాలు లభిస్తాయి. సులభతర వాణిజ్య విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పెట్టుబడిదారులు, నిర్మాణ సంస్థలు, స్థిరాస్తి రంగానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని శ్రీధర్‌బాబు అన్నారు.

# ఆస్తి పంపకాల తర్వాతనే 'అమ్మ' అంత్యక్రియలు

## - రెండు రోజులుగా ఇంట్లోనే భౌతిక కాయం
## - ఆస్తికోసం మాతృత్వం మరిచిన పిల్లలు





**సూర్యాపేట (ప్రశ్న న్యూస్)** అమ్మ ఈ సృష్టిలో ఓ గొప్ప పదం. బిడ్డలను నవమాసాలు మోసి కని ఎన్నో కష్టాలకోర్చి పెంచి వారు ఎదుగుతుంటే చూసి ఆనందిస్తుంది. అలాంటి అమ్మ రుణం ఏమిచ్చినా తీర్చుకోలేము. అయితే, వృద్ధాప్యంలో తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారు కొందరైతే మరికొందరు ఆస్తుల కోసం వారిపైనే దాడికి పాల్పడిన ఘటనలు మనం చూసుంటాం. ఆస్తి పంపకాల విషయంలో చెలరేగిన వివాదం అవి ఓ కొలిక్కి రాలేదని ఓ తల్లికి బిడ్డలు అంత్యక్రియలు చేసేందుకు నిరాకరించారు. గత రెండు రోజులుగా ఆమె భౌతిక కాయం ఇంట్లోనే ఉంచేశారు. ఈ అమానవీయ ఘటన సూర్యాపేట జిల్లాలో జరిగింది.

### 2 రోజులుగా ఇంట్లోనే భౌతిక కాయం

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామంలో వేము లక్ష్మమ్మ (80) అనే వృద్ధురాలు అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కాగా ఓ కుమారుడు ఇది వరకే మరణించాడు. ఆమె వద్ద రూ.21 లక్షల విలువైన ఆస్తి, 20 తులాల బంగారం ఉన్నాయి. తల్లి చనిపోయిందన్న వార్త తెలుసుకున్న ఇంకో కుమారుడు, కోడలు, కుమార్తెలు గ్రామానికి చేరుకున్నారు. అయితే, తల్లి అంత్యక్రియల విషయం పట్టించుకోకుండా ఆస్తి పంపకాల విషయమై వీరు గొడవ పెట్టుకున్నారు. గ్రామ పెద్దల దగ్గర ఆస్తి పంచాయతీ పెట్టుకున్నారు. గత రెండు రోజులుగా ఈ తంతు కొనసాగుతూనే ఉండగా ఓ కొలిక్కి రాలేదు.


### అంత్యక్రియల ఖర్చు కోసం

లక్ష్మమ్మ వద్ద ఉన్న రూ.21 లక్షల్లో వైద్య ఖర్చులకు రూ.6 లక్షలు పోగా మిగిలిన రూ.15 లక్షలు కొడుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలి వద్ద ఉన్న 20 తులాల బంగారాన్ని ముగ్గురు కూతుళ్లు సమానంగా పంచుకున్నారు. అయితే, పంపకాలు సరిగ్గానే తేలినా కొడుకు చివరి క్షణంలో అంత్యక్రియల ఖర్చుపై ప్రశ్నించడంతో మళ్లీ వివాదం రేగింది. అంత్యక్రియలకు అయ్యే ఖర్చును సమానంగా భరించాలని అలా జరిగితేనే తలకొరివి పెడతానని తేల్చిచెప్పాడు. దీంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. కొడుకు, కుమార్తెల మధ్య గొడవ నేపథ్యంలో ఫ్రీజర్ లోనే గత రెండు రోజులుగా తల్లి మృతదేహం ఉండిపోయింది. అయితే, ఆస్తి కోసం కన్నబిడ్డలే అమ్మ అంత్యక్రియలు నిర్వహించకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మమ్మ బతికుండగా అందరితో బాగానే ఉందని ఇప్పుడు ఆమె అంత్యక్రియలు ఇలా ఆస్తి గొడవలతో ఆగిపోవడం బాధగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

# తూంకుంట పెద్ద చెరువు ఎఫ్ టీఎల్ స్థలం మాయం

## కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

- చెరువు స్థలాన్ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ - ఎఫ్ టీఎల్, దేవాలయ భూముల కబ్జా





**షామీర్పేట్ (ప్రశ్న న్యూస్)** తూముకుంట మున్సిపల్ పరిధిలో అక్రమ లే అవుట్ల జోరు కొనసాగుతుంది అధికారులకు అందిన కాడికి సమర్పించుకొని కబ్జాలు కామెంట్ చేస్తున్నారు. తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు ఎఫ్ టీఎల్ లో అక్రమ లే అవుట్ వేసి కబ్జా చేస్తున్నా వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ తూంకుంట మున్సిప్ కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. తూంకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 318/ఇ, 318/ఇ/బి లలో విస్తరించి ఉన్న పెద్ద చెరువు ఎఫ్ టీఎల్ పరిధిలోని 30 గుంటల స్థలాన్ని నోములు సులోచన, ఆమె భర్త నోముల మధుసూదన్ రెడ్డిలు కొనుగోలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెచ్ఎండీఏ నుంచి ఏ ఇతర సంబంధిత శాఖల నుంచి ఏలాంటి అనుమతి లేకుండానే అక్రమ లే అవుట్ వేసి అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్మి రూ. కోట్ల రూపాయాలు కొల్లగోడుతున్నట్లు ఎద్దు నగేష్ ఆరోపించారు. ఇదే విషయమై ఫిర్యాదులు రావడంతో గతంలో తూంకుంట మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది లే అవుట్ లో అక్రమ నిర్మాణాలను రెండు సార్లు కూల్చివేసినట్లు తెలిపారు. అయినా నోముల సులోచన, మధుసూదన్ రెడ్డిలు అమాయక ప్రజలకు ప్లాట్లను విక్రయిస్తూ మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఇటీవలే ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులు మున్సిపల్ శాఖ అధికారులతో సంయుక్తంగా సర్వే చేసి పెద్ద చెరువు కు సంబంధించి ఎఫ్ టీఎల్ హద్దురాళ్లను పాతినట్లు తెలిపారు. పెద్ద చెరువు ఎఫ్ టీ ఎల్ స్థలంలో వెలిసిన అక్రమ లే అవుట్ లోని రోడ్లను, ప్లాట్లను తొలగించాలన్నారు.



### ఆలయ భూములను వదడం లేదు...

తూంకుంట మున్సిపాలిటీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములను కబ్జాదారులు వదడం లేదు. సర్వే నెంబర్325 లోని ఒక ఎకరం 16 గుంటల స్థలం తోపాటు 326 సర్వే నెంబర్ లో 23 గుంటల స్థలం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భూములున్నాయి. దేవాలయ భూముల పక్కనే సర్వే నెంబర్ 324లో నోముల బ్రదర్స్ కు కొంత స్థలం ఉంది. దీన్నే అదునుగా తీసుకున్న నోముల క్రిష్ణారెడ్డి, నోముల మధుసూదన్ రెడ్డిలు దేవాలయ భూములను అక్రమించుకోని ప్లాట్లు విక్రయించి సోమ్ము చేసుకుంటురన్నారనే ఆరోపణలున్నాయి. ఆలయ భూములను ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోవటం లేదని పైగా మున్సిపల్ అధికారులు ఆలయ భూముల్లో సైతం ఇంటి అనుమతులు మంజూరు చేయటం విశేషం. ఇక్కడి పెద్ద చెరువు ఎఫ్ టీఎల్ స్థలం, ఆలయ భూముల్లో వెలుస్తున్న రియల్ ఎస్టేట్ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి ఆలయ భూములను, చెరువు ఎఫ్ టీఎల్ స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588